జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 4 సంచిక 51 | హైదరాబాద్, డిసెంబర్ 10 గురువారం 2020 | 8 పేజీలు | వెల : 5.00


## ఆత్మనిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజనకు రూ.22 వేల కోట్లు



న్యూఢిల్లీ, డిసెంబరు 09 : కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో అమలైన అష్ట దిగ్బంధనం వల్ల వ్యాపార సంస్థలు, ఉద్యోగులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆత్మ నిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన ద్వారా ఉపాధి అవకాశాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఉపాధి కల్పనే లక్ష్యంగా కొన్ని చర్యలు తీసుకున్నారు. కొత్తగా ఉద్యోగులను నియమించుకునే విధంగా వ్యాపార సంస్థలను ప్రోత్సహించేందుకు రూ.22,810 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కార్మిక శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ విలేకర్లకు తెలిపారు. ఆత్మ నిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన క్రింద కేంద్ర ప్రభుత్వం రెండేళ్ళపాటు రిటైర్‌మెంట్ ఫండ్‌కు కంట్రిబ్యూషన్‌ను అందజేస్తుందని తెలిపారు. వ్యాపార సంస్థలు కొత్తగా ఉద్యోగులను నియమించుకుంటే, ఆ కొత్త ఉద్యోగులు, యజమానుల కంట్రిబ్యూషన్‌ను రెండేళ్ళపాటు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ పథకం 2023 వరకు అమలవుతుందన్నారు. దీనివల్ల 58.5 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందుతారన్నారు. 2020 అక్టోబరు 1 నుంచి 2021 జూన్ 30 వరకు కొత్తగా ఉద్యోగులను నియమించుకుంటే ఈ పథకం వర్తిస్తుంది. ఈ కొత్త ఉద్యోగులు తమ నెలసరి వేతనంలో ఉద్యోగుల భవిష్య నిధికి చెల్లించవలసిన కంట్రిబ్యూషన్ 12 శాతం, అదేవిధంగా యజమానులు చెల్లించవలసిన 12 శాతం, మొత్తం 24 శాతం సొమ్మును ప్రభుత్వమే చెల్లిస్తుంది. గరిష్ఠంగా 1,000 మంది ఉద్యోగులను నియమించుకునే సంస్థలకు ఈ పథకం వర్తిస్తుంది. 1,000 మందికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థలకు యజమానులు చెల్లించవలసిన 12 శాతాన్ని ప్రభుత్వం చెల్లించదు, కేవలం ఈ సంస్థల్లోని ఉద్యోగులు చెల్లించవలసిన 12 శాతాన్ని మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుంది.

## మోదీకి కేసీఆర్ లేఖ



హైదరాబాద్,డిసెంబరు 09 : దేశ రాజధానిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోయే సెంట్రల్ విస్టాకు శంఖుస్థాపన చేయబోతున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రధాన మంత్రికి కేసీఆర్ లేఖ రాశారు. గొప్ప ప్రాజెక్టు అయిన సెంట్రల్ విస్టా దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని సీఎం కొనియాడారు. దేశ రాజధానిలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం అవసరాలకు తగినట్లుగా లేకపోవడమే కాకుండా, అవి వలస పాలనకు గుర్తుగా ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ రాజధానిలో ఇలాంటి నిర్మాణం అవసరం ఎప్పటి నుంచో ఉందని పేర్కొన్నారు. "సెంట్రల్ విస్టా ప్రాజెక్టు ఆత్మగౌరవానికి, ప్రతిష్టకు, పునరుజ్జీవనానికి, పటిష్టమైన భారతదేశానికి చిహ్నంగా నిలుస్తుంది. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం కావాలి" అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## కేంద్రం ప్రతిపాదనను తిరస్కరించిన రైతులు



న్యూఢిల్లీ,డిసెంబరు 09 : వివాదస్పద వ్యవసాయ చట్టాలపై కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన ప్రతిపాదనను రైతులు ఏకగ్రీవంగా తిరస్కరించారు. అంతే కాకుండా డిసెంబర్ 14న దేశ వ్యాప్త నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. రైతు ఉత్పత్తుల సేకరణకు ప్రస్తుతం అమలులో ఉన్న కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) విధానం కొనసాగుతుందని, ఈ మేరకు లిఖిత పూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ ప్రతిపాదనలో కేంద్రం పేర్కొంది. అయితే వ్యవసాయ చట్టాలు రద్దు చేయడం మినహా మరే ప్రతిపాదనకు ఒప్పుకునేది లేదని రైతులు మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. "కేంద్రం ప్రతిపాదన గురించి మా సమావేశంలో వ్యూహరచన చేస్తాము. ఈ విషయమై రైతులు ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గేది లేదు. ఇది మా గౌరవానికి సంబంధించిన విషయం. ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను ఎందుకు ఉపసంహరించుకోదు? వాళ్లు అంత దౌర్జన్యంగా వ్యవహరిస్తారా? ప్రభుత్వానికి ఎంత పట్టుదల ఉందో రైతులకు కూడా అంతే పట్టుదల ఉంది. వ్యవసాయ చట్టాల్ని ఉపసంహరించుకోవాల్సిందే" అని భారతీయ కిసాన్ యూనియన్ ప్రతినిధఇ రాకేష్ టికైట్ అన్నారు. సెప్టెంబర్‌లో ఆమోదించిన కొత్త వ్యవసాయ చట్టాలు (మిగతా 3లో..)

## ముందుగా అమెరికన్లకే వ్యాక్సిన్: ట్రంప్



వాషింగ్టన్,డిసెంబరు 09 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కరోనా వైరస్ వ్యాక్సిన్ విషయంలోనూ అమెరికన్లే ముందు అ్న నినాదాన్ని వినిపించారు. వ్యాక్సిన్ ప్రాధాన్యతా క్రమంలో అమెరికన్లే ముందు ఉండాలని మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇప్పటికే అమెరికాకు చెందిన వ్యాక్సిన్ తయారీ సంస్థలు పలు దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో ట్రంప్ ఆదేశాలు న్యాయ సమీక్షకు నిలబడతాయా లేదా అన్నది సందేహంగా మారింది. మరోవైపు అసలు అమెరికా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వ్యాక్సిన్ డోసులు లభ్యమవుతాయా అన్నది కూడా అనుమానంగానే ఉంది. ఫిబ్రవరిలోగా 10 కోట్ల మందికి, జూన్‌లోగా మొత్తం అమెరికన్లకు వ్యాక్సిన్ ఇవ్వాలని అక్కడి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఆ దిశగా ప్రయత్నాలు మాత్రం జరగడం లేదని అధ్యక్షుడిగా (మిగతా 3లో..)

## భారత్‌బయోటెక్‌లో విదేశీ రాయబారులు



హైదరాబాద్,డిసెంబరు 09 :64 దేశాలకు చెందిన రాయబారులు ఇవాళ భారత్‌బయోటెక్ సంస్థను సందర్శించారు. కోవిడ్ టీకా కోవాగ్జిన్‌ను ఆ సంస్థ తయారు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే వ్యాక్సిన్ పురోగతి గురించి తెలుసుకునేందుకు విదేశీ రాయబారులు ఇవాళ హైదరాబాద్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో వారంతా భారత్‌బయోటెక్ ఫార్మసీ సంస్థను విజిట్ చేశారు. కోవాగ్జిన్ గురించి సంస్థ చైర్మన్, ఎండీ డాక్టర్ కృష్ణ ఎల్లా విదేశీ రాయబారులకు వివరించారు. కోవాగ్జిన్ టీకా మూడవ దశ ట్రయల్స్ ఇండియాలో కొనసాగుతున్నాయి. అయితే త్వరలోనే ఆ టీకా ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. అత్యవసర వినియోగానికి అనుమతి ఇవ్వాలంటూ భారత్‌బయోటెక్ సంస్థ ప్రభుత్వానికి దరఖాస్తున్న చేసుకున్నది. ఇటీవల ప్రధాని మోదీ కూడా భారత్‌బయోటక్ సంస్థను సందర్శించారు. అక్కడ జరుగుతున్న వ్యాక్సిన్ పురోగతిని ఆయన తెలుసుకున్నారు.

జీనోమ్ వ్యాలీలోనే 33 శాతం టీకాలు..

కోవిడ్ టీకా పురోగతి తెలుసుకునేందుకు హైదరాబాద్‌కు వచ్చిన 64 మంది విదేశీ రాయబారులకు భారతబయోటెక్ సంస్థ ఎండీ కృష్ణ ఎల్లా ప్రజెంటేషన్ ఇచ్చారు. జీనోమ్ వ్యాలీలోనే 33 శాతం టీకాలు ఉత్పత్తి అవుతున్నట్లు రాయబారులతో డాక్టర్ కృష్ణ తెలిపారు. మానవజాతి కోసం వ్యాక్సిన్లు అందుబాటులో ఉంటాయని, ఫార్మసీ పరిశ్రమకు మంచి రోజులు ఉంటాయని ప్రధాని చెప్పినట్లు ఎండీ కృష్ణ ఎల్లా గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఎఫ్‌డీఏ ఆమోదం తెలిపిన వ్యాక్సిన్ సదుపాయాలు ఎక్కువగా ఉన్నట్లు కృష్ణ ఎల్లా వెల్లడించారు. జీనోమ్ వ్యాలీని సందర్శించిన విదేశీ రాయబారులు ఇవాళ భారత్‌బయోటెక్ సంస్థలో టూర్ చేశారు. అక్కడ జరుగుతున్న వ్యాక్సిన్ పురోగతి గురించి తెలుసుకున్నారు. భారత్‌బయోటెక్‌తో పాటు విదేశీ రాయబారులు మరో ఫార్మసీ సంస్థ బయోలాజికల్ ఈని కూడా సందర్శిస్తున్నారు.

## సిరిసిల్లాలో మంత్రి కేటీఆర్‌కు నిరసన సెగ



సిరిసిల్లా,డిసెంబరు 09 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంత్రి కేటీఆర్‌కు నిరసన సెగ తగిలింది. ఎల్లారెడ్డిపేటలో మున్నూరు కాపు సంఘ భవనాన్ని ప్రారంభించి, కార్యకర్త వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న మంత్రి కేటీఆర్‌ను అడ్డుకునేందుకు బిజెపి కార్యకర్తలు యత్నించారు. డిగ్రీ కళాశాల కావాలని మంత్రి కాన్వాయిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు బిజెపి కార్యకర్తలను అడ్డుకొని పలువురిని అదుపులోకి తీసుకున్నారు. బిజేపి నేతల తీరుపై నిరసన వ్యక్తం చేసిన టిఆర్ఎస్ కార్యకర్తలు.. నలుగురు బీజేపీ కార్యకర్తలపై దాడిచేసి, ఓ బైకును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో సాయికుమార్ అనే బీజేపీ కార్యకర్త గాయపడగా, ఇరువర్గాల ఆందోళనలతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టిఆర్ఎస్ కార్యకర్తల దాడిని నిరసిస్తూ బిజేపి కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. స్టేషన్ ముందు రోడ్డుపై బైఠాయించి దాడికి పాల్పడ్డ టిఆర్ఎస్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన బీజేపీ కార్యకర్తలపై టిఆర్ఎస్ గుండాలు దాడి చేశారని ఆరోపించారు. పార్టీకి సంబంధం లేని మైనార్టీ యువకుడిపై మంత్రి సమక్షంలోనే టిఆర్ఎస్ గుండాలు దాడి చేశారని, దాడికి మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారిని సముదాయించి చర్యలు తీసుకుంటామని చెప్పి ఆందోళనను విరమింపజేశారు.

## శ్యామల ఎవరో నాకు తెలియదు: మల్లారెడ్డి



హైదరాబాద్,డిసెంబరు 09 : తనపై వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి స్పందించారు. భూమిని ఆక్రమించినట్లు వచ్చిన ఆరోపణలలో వాస్తవం లేదని ఆయన అన్నారు. మంత్రి మల్లారెడ్డి బుధవారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఆ శ్యామలదేవి ఎవరో కూడా తెలియదు. నా భూమి పక్క భూమి ఆమెది అని తెలుస్తుంది. ఇప్పటికే నాకు చాలా భూమి ఉంది. నేను ప్రజలకు సేవ చేస్తున్నా. ఒక మహిళకు మంత్రిగా సహాయం చేయడానికి సిద్ధం. శ్యామల అనే మహిళ ... నన్ను ఇప్పటివరకూ కలవలేదు. నేను ఎవరినీ బెదిరించలేదు. ఎలాంటి విచారణకు అయినా సిద్ధమే' అని స్పష్టం చేశారు. కాగా భూ వివాదంలో మంత్రి మల్లారెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఓ మహిళకు చెందిన భూమిని ఆక్రమించడమే కాకుండా రిజిస్ట్రేషన్ చేయాలంటూ బెదిరింపులకు దిగుతున్నారన్న ఆరోపణలపై దుండిగల్ ఠాణాలో ఈ నెల 6వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు అయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంత్రితో పాటు ఆయన కుమారుడిపై కూడా కేసు నమోదు అయింది.




# తెరాస రాజ్యంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్ళు..

పఠాన్ చెరు ఎమ్మెల్యే తీరు అభ్యంతరకరం..

గతంలోనూ మీడియా గొంతు నొక్కేందుకు ప్రయత్నించిన ప్రభుత్వం

వాస్తవాలను వెలికి తీస్తే చంపేస్తారా.?

జాట్ రాష్ట్ర కార్యదర్శి గోనెల

హైదరాబాద్ (ప్రజాపాలన) : స్వరాష్ట్రంలో జర్నలిస్టులకు ఎంతో గౌరవం దక్కుతుందని రాష్ట్రంలోని పాత్రికేయులు ఉద్యమంలో ఉత్సాహంగా భాగమయ్యారని జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ(జాట్) రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమారస్వామి ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీలో భాగంగా ప్రస్తుత సీఎం కేసీఆర్ కు మీడియా అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ అదే మీడియా గొంతును నొక్కేందుకు ఉద్యమ పార్టీగా చెప్పుకునే తెరాస ప్రయత్నించడం విస్మయాన్ని కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధులకు రక్షణ కల్పించలేని ప్రభుత్వం ప్రజలకు రక్షణ కల్పిస్తుందా అని అనుమానాలు వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ సంతోష్ నాయక్ విషయంలో పఠాన్ చెరు ఎమ్మెల్యే తీరు అభ్యంతరకరం అని తెలిపారు. విలేకరికి హాని కలిగితే అందుకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అసభ్య పదజాలంతో దూషించడం సబబు కాదన్నారు. గతంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఓ మీడియా విలేకరిపై కక్షపురితంగా వ్యవహరించారని, ఇప్పుడు ఈ సంఘటన పత్రికా స్వేచ్ఛకు ప్రభుత్వం సంకెళ్లు వేసే ప్రయత్నం చేస్తుందా



అనే అనుమానాలు కలిగిస్తుందని అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో ఓ న్యూస్ ఛానల్ పై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయని పేర్కొన్నారు. ఇది మీడియా స్వేచ్ఛను సీఎం కేసీఆర్ బానిసగా మార్చేందుకు జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. ప్రజల పక్షాన నిలబడి వాస్తవాలను వెలికి తీస్తే తమకు దక్కే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన నిలిచే మీడియా ప్రతినిధులను చంపేస్తారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటికైనా తెరాస ప్రభుత్వం పాత్రికేయుల విషయంలో తన ధోరణి మార్చుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తప్పులను సరిదిద్దుకోవాలి గాని.. ప్రశ్నించేవారిని అణచి వేయాలని చూడొద్దని హితవు పలికారు. లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. మీడియా సభ్యులకు జాట్ అండగా నిలుస్తుందని ప్రకటించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**మధిర, డిసెంబర్ 9, ప్రజాపాలన :** మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర శ్యాసన సభ్యులు మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేయించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మధిర పట్టణానికి చెందిన షేక్ మిరాభికి మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంసెట్టి కిషోర్, ముస్లిం వెల్ఫేర్ కమీటీ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ అలీ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంసెట్టి కిషోర్ , సర్పంచ్ చిట్టిబాబు, మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు అద్దంకి రవి,నవీన్,మధిర పట్టణ మైనార్టీ అధ్యక్షులు షేక్ జహంగీర్, కాంగ్రెస్ నాయకులు బాజి,రహీం, ఆదీములం శ్రీను,మైలవరపు చక్రి, పలువురు పాల్గొన్నారు

## నెల్లూరి భద్రయ్య కుటుంబాన్ని పరామర్శించిన కొండబాల



**పాలేరు నేలకొండపల్లి డిసెంబర్ 3 ప్రజాపాలన :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లి కొత్తూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ఇటీవలే మృతి చెందిన సీనియర్ నాయకులు నెల్లూరి భద్రయ్య మాతృమూర్తి అమృతమ్మ గారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం నాయకులు కార్యకర్తలు తో కాసేపు ముచ్చటించారు మండలంలోని రాజకీయ విశ్లేషణలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి రైతు సమితి అధ్యక్షుడు ఎడవల్లి సైదులు గంజికుంట్ల వెంకన్న కొడాలి గోవిందరావు చింత నిప్పు సైదులు ఇస్లావత్ బాలాజీ తుమ్మ ఉపేందర్ వైస్ సర్పంచ్ ఎస్.కె హుస్సేన్ బి మందపల్లి రంగారావు నెల్లూరి అప్పారావు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలు



**పాలేరు నేలకొండపల్లి డిసెంబర్ 3 ప్రజాపాలన :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ గారి పుట్టినరోజు వేడుకలు నేలకొండపల్లి మండలం లో జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జెర్రిపోతు అంజనీ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి సర్పంచ్ రాయపూడి నవీన్ కుమార్ ఆర్, ఉప సర్పంచ్ లక్కం ఏడుకొండలు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, పాలేరు నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు బచ్చల కూరి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దోసపాడు శేఖర్, మాజీ ఎంపీటీసీ ముత్యాల రామకృష్ణ, ఎస్ కె మదర్, ఎడవెల్లి నాగరాజు, మారుతి కోటేశ్వరరావు, వ్యాసం శివ, రాచకొండ అయ్యప్ప, బండి రామారావు, పచ్చిపాల సాయి, పచ్చిపాల మధు, కాసాని సీతారాములు, తదితరులు పాల్గొన్నారు


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| తల్లనారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | - | కొల్చారం | - | 9912532909 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| అన్వర్ బాషా | - | కుత్బుల్లాపూర్ | - | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |


## మంజిత్ కాటన్ మిల్‌ను సందర్శించిన సిపిఐ మధిర పట్టణ కార్యదర్శి బెజవాడ రవి

**మధిర, డిసెంబర్ 9, ప్రజాపాలన :** గత రాత్రి మంజిత్ కాటన్ మిల్ లో అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సిపిఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్బంగా అక్కడవున్న యాజమాన్యం తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. షార్ట్ సార్క్యూట్ కారణంగా మిల్లులో రైతులనుండి కొనుగోలు చేసిన పత్తి నుండి దూది వేరుచేయగా వచ్చిన విత్తనాలపైన వున్న దూది లేయరను విడదీసే విభాగంలో మంటలు వచ్చాయని అవికూడా షెడ్ కు ఇరువైపులా రావడంతో సీడ్ మరియు సీడ్ పైన వుండే లేయర్ కొంత మేరకు కాలిపోయినట్లుగా



అలాగే పత్తి ఖాళీ బోరాలు కూడా కాలిపోయినట్లుగా చెప్పారు సీ సీ ఐ కొనుగోలు చేసిన పత్తిగాని దూది కానీ ఈ ప్రమాదంలో నష్టం జరగలేదని సీసీఐ అధికారులు చెప్పారని రవిబాబు తెలిపారు. అగ్నిమాపాక సిబ్బంది, మరియు అధికారులు తక్షణమే స్పందించి మంటలను అదుపులోకి తేవడం వలననే పెను నష్టం జరగకుండా వుంది అనితెలియజేసారు. వీరితో పాటు ఏ ఐ టీ యూ సీ మధిర డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వర్రావు మండల కార్యవర్గ సభ్యులు మంగళగిరి రామాంజయ్య పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాఠశాలల్లో నిరసనలు



**మధిర, డిసెంబర్ 9, ప్రజాపాలన :** USPC,JACTO USPC JACTO రాష్ట్రవ్యాప్త దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా, రేపు దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలైన ప్రమోషన్లు బదిలీలు వెంటనే నిర్వహించాలని పీఆర్సీ అమలు పరచాలని, మే 16,2018 న ముఖ్యమంత్రి స్వయంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చాలని కోరుతూ జడ్పీహెచ్ఎస్ మాటూరులో ప్రధానోపాధ్యాయులు సాయి కృష్ణమాచార్యులు ఉపాధ్యాయులు ఇబ్రహీం శ్రీనివాస రావు ఆదాము వెంకటరమణ ఆర్ బి శ్రీనివాసరావు మొదలగు వారు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసమే వ్యవసాయ బిల్లులు : బిజెపి

ఉనికి కోసమే రాజకీయ నాయకుల కుట్రలు

**మందమర్రి డిసెంబర్ 9 ప్రజాపాలన :** భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం రైతుల క్షేమం కోసం, రైతులకు సరైన గిట్టుబాటు ధర కోసం, తాను పండించిన పంట తన ఇష్టమొచ్చిన రేటుకు అమ్ముకొనే వీలున్న చట్టాలు తీసుకు వచ్చారని మందమర్రి మండల బిజెపి పార్టీ అధ్యక్ష్యులు పైడిమల్ల నర్సింగ్ మందమర్రి ప్రస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ చట్టాలు అమలు అయితే ఇతర రాజకీయ పార్టీలకు భవిష్యత్ ఉండదని, రాజకీయ మనుగడ కోసం రైతులను తప్పుదారి పట్టించి వారిని ఆగం చేస్తున్నారని ఆయన అన్నారు. రైతు తాను పండించిన పంట రేటు ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడ అమ్ముకొనే విలు కల్పిం చారని ఒక సువర్ణావకాశాన్ని కల్పించారని అయన అన్నారు. టిఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వం రైతుల కోసం అని మోసలి కన్నీరు కార్చు తూ, నేడు రాస్తారోకోలని, ధర్నాలని, చేసన్తా రైతు లను మోసగిస్తు



న్నారని ఆయన అన్నా రు. రైతులను ఎల్ ఆర్ ఎస్ పేరిట, రిజిస్ట్రేషన్ల పేరిట రైతును కుదేలు చేస్తున్నారని ఆయన అన్నారు. వీరి మోసాలన్ని రైతులు తెలుసుకొనే రోజు దగ్గరలోనే ఉందని సన్న వరి వేయమని చెప్పి పంట వచ్చిన తరువాత వాటిని కొనుగోలు చేయకుండా రైతును ఇబ్బందులకు గురి చేస్తుందని రైతులతో బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తుందని తాను చెప్పిన పంట వేయకపోతే పంట కొనుగోలు చేయమని, రైతు బందు పథకం వర్తించదని చేస్తున్నారని ఆయన అన్నారు. ఎల్ ఆర్ ఎస్ ను టి ఆర్ ఎస్ ప్రభుత్వం రద్దు చేయకుంటే అధికారంలోకి వచ్చాక బిజెపి పార్టీ ఎల్ ఆర్ ఎస్ ను రద్దు చేస్తామని బిజెపి రాష్ట్రనాయకత్వం ఇప్పటికే చెప్పిందని ఆయన అన్నారు. 55సంవత్సరాల తరువాత రైతులకు ఫెంక్షన్ ఇచ్చే పథకాన్ని కూడా అమలు చేయనున్నారని తెలిపారు. రైతు పంట నష్టపోతే ఫసత్ భీమా కింద నష్టాన్ని కూడా రైతు ఎకౌంట్‌లలో వేస్తామని తెలిపారు. ఇవి రైతు వ్యతిరేక విదానాలని అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వంజరి వెంకటేష్ ప్రదాన కార్యదర్శి, బోర్లకుంట లక్ష్మణ్ ఉపాధ్యక్ష్యులు, పల్ల వవన్ కుమార్ కార్యదర్శి, నీరటి వెంకటేష్ బిజెవైఎం మండల ఉపాధ్యక్ష్యుడు, గంజి రాజేష్, మాసు రమేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రుపాలెంలో సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు



**మధిర, డిసెంబర్ 9, ప్రజాపాలన :** ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం 60 సంవత్సరాలుగా ఉద్యమం చెస్తూ ఎంతోమంది విద్యార్థుల బలిదానాలు చేసుకున్నారని భావించి 2014 లొ సాహసోపేతమైన తెలంగాణ బిల్లును పార్లమెంటులో పాస్ చేయించి రాష్ట్రాన్ని ఇచ్చిన తెలంగాణా తల్లి సోనియా అని కొనియాడారు. ఈకార్యక్రమంలో వేమిరెడ్డి సుదాకర్ రెడ్డి, బండారు నరసింహారావు,షేక్ ఇస్మాయిల్,కడియం శ్రీను,తల్లపురెడ్డి నాగిరెడ్డి,కంచర్ల వెంకటనర్సయ్య,షేక్ జానిభాషా, రావూరి నాగబాబు,దేవరకొండ శ్రీను, బొగ్గుల రామకృష్ణారెడ్డి, రాజీవ్ గాంధీ, లింగాల నాగేశ్వరరావు, వెంకటప్పారెడ్డి, మెట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజలో తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 09 ( ప్రజాపాలన ) :** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట్ లో మాజీ కౌన్సిలర్ మధు స్వామి 18వ దీక్ష పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కొబ్బరి చెట్టుకు పూజా కైంకర్యాలు నిర్వహించి స్వాముల ఆశీర్వాదం తీసుకొని అయ్యప్పస్వామి మహా పడిపూజ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో భాగంగా స్వామికి అభిషేకాలు నిర్వహించారు. కన్య స్వాములు చేత అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వాములు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మహా పడి పూజా కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పాల్గొన్నారు. 18 సార్లు పూర్తిచేసుకున్న మధు స్వామికి గురు స్వాములు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు నరసింహులు గౌడ్ యాదయ్య హనుమంతు నాగేంద్ర స్వామి నాగరాజు గురుస్వామి మాజీ కౌన్సిలర్ వెంకట్ రమణ నాగరాజు గౌడ్ భజన మండలి రవి శర్మ కపిల్ డోలక్ ప్రదీప్ డొకోమో రవి భజనలతో మారుమోగించారు.

## పటాన్ చెరువు ఎమ్మెల్యే వైఖరిని ఖండిస్తున్న జర్నలిస్టులు

**బాలాపూర్ : ప్రజాపాలన న్యూస్ :** మహేశ్వరం నియోజకవర్గం లోని బాలాపూర్ మండలం బాలాపూర్ చౌరస్తా లో టియుడబ్ల్యూ జే మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో జర్నలిస్టుల నిరసన నిర్వహించారు. టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గాధం రమేష్ హాజరై జర్నలిస్టుల



నిరసన సందర్భంగా మాట్లాడుతూ.... పట్నన్ చెరువు ఎమ్మెల్యే వైఖరిని ఖండిస్తున్నాం..... ఎమ్మెల్యేపై చట్టరీత్యా చర్యలు..... తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే అధికార మదంతో పటాన్ చెరువు వార్త విలేకరి సంతోష్ నాయక్ ను అసభ్యకర పదజాలంతో దూషించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీయూడబ్ల్యూజే బాలాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. టి యు డబ్ల్యూ జే 143 తీవ్రంగా ఖండిస్తున్నది..... భూబకాసురుడైన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గుట్టును బయటపెట్టిన జర్నలిస్టును ఫోన్లో బెదిరించడం, సభ్యసమాజం తలదించుకునే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. వీధి రౌడీలాగా ప్రవర్తించిన మహిపాల్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని,చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, టియూడబ్ల్యూజే జర్నలిస్టులు అందరూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గాధం రమేష్, మాహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గురువుని శ్రీకాంత్, నాయకులు అమ్రాబాద్ సాయి, శ్రీధర్, రమేష్ గుప్తా, బి గణేష్, మహేందర్, గొంగడి శ్రీను, కృష్ణ, మహేష్, , గణేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# తడి, పొడి, చెత్త, వ్యర్థ పదార్థాలు ఎరువులుగా మార్చాలి

### ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

### వ్యర్థ పదార్థాల నిర్వహణ పై అవగాహన సదస్సు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి (ప్రజాపాలన): గ్రామ పంచాయతీలలో ప్రతిరోజు జమ చేసే తడి, పొడి, చెత్త వ్యర్థపదార్థాలను ఎరువుగా మార్చాలని, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయడంలో ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని కేబి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఐకేపీ సిబ్బంది, పంచాయతీ సర్పంచులు, పంచాయతీ సిబ్బందితో, వ్యర్థ పదార్థాల నిర్వహణ పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పంచాయతీలలో ప్రతిరోజు జమ చేసే చెత్తను ఎరువుగా మార్చాలని సూచించారు. దీనివలన పంచాయతీ పరిధిలో అధిక పంటలు పండి మంచి దిగుబడి వస్తుందన్నారు. దీని వలన ఆర్థిక స్థితి గతులు మెరుగుపడతాయని అన్నారు. అలాగే పల్లె ప్రకృతి వరాలు ఏర్పాటు చేయడం, ప్రణాళికాబద్ధంగా ఉండాలని సూచించారు. పల్లె ప్రకృతి వనరులకు ఎంపిక చేసుకున్న స్థలాలను ఆధారంగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటే క్రమంలో 3 వరుసలు నాటాలని సూచించారు. దీనిలో మొదటి వరుస పెద్దగా పెరిగే చెట్లు, రెండో వరుస కొంచం చిన్నగా పెరిగేవి, మూడవ దశలో మరింత చిన్నగా పెరిగే చెట్లును పెంచాలన్నారు. దీనివలన పల్లె ప్రకృతి వనాలు అందంగా కనిపిస్తాయని తెలిపారు. ప్రకృతి వరాలు తీర్మాణం 40 గంటల లో ఉన్నట్లయితే 4వేల మొక్కలు, 30 గంటలు అయితే 3 వేల మొక్కలు, 20 గంటలు అయితే 2 వేల మొక్కలు ఉండేలా చూడాలని సూచించారు. పనులలో అలసత్వం వహించ కూడదని తెలిపారు. అనంతరం ఇబ్బంది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రారా తడి, పొడి, చెత్తను వేరుగా తయారు చేసే విధానం వర్మి కంపోస్టు ఎరువు తయారు చేసే విధానం, పల్లె ప్రకృతి వనం లో మొక్కలు నాటే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సాయి గౌడ్, డి ఆర్డి ఓ పి డి వెంకట్ శైలేష్, డి పి ఓ రమేష్, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, ఏపీ డి రామకృష్ణ, ఎంపీడీవో శశికళ, ఎంపీడీవో ప్రసాద్, మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ సిబ్బంది, ఐకేపీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్

హైదరాబాద్, డిసెంబర్ 9 :ఈజీ మనీ కోసం కొందరు, సరదాగా ఆడటం మొదలెట్టి బానిసలుగా మారిన మరికొందరు.. ఆన్?లైన్?లో పెయిడ్? గేమ్స్, బెట్టింగ్స్?తో యూత్? బతుకులు ఆగం చేసుకుంటున్నారు. మెల్లమెల్లగా అప్పుల పాలై, తిరిగి కట్టలేక, ఇంట్లో వాళ్లకు చెప్పలేక ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇంకొందరైతే అప్పులు తీర్చేందుకు దొంగలుగా, చైన్? స్నాచర్లుగా, సైబర్? నేరగాళ్లుగా మారుతున్నరు. పైసల కోసం ఇంట్లో వాళ్లనూ చంపడానికి వెనుకాడట్లేదు. ఈ ఆన్?లైన్? పెయిడ్? గేమ్స్, బెట్టింగ్స్? బారినపడి భవిష్యత్? నాశనం చేసుకుంటున్నారు. ఇందులో 20 ఏండ్ల నుంచి 35 ఏండ్ల మధ్య వయసువారే ఎక్కువ ఉంటుండటం ఆందోళన కలిగిస్తోంది. 'డబ్బులు సంపాదించడం ఎలా?' అని ఇంటర్నెట్?లో ఒక్కసారి సెర్చ్ చేస్తే లెక్కలేనన్ని ఆప్షన్స్ కనిపిస్తాయి. స్మార్ట్ ఫోన్ లో ఈజీ మనీ కోసం వెతికేవారికి ఆన్?లైన్?రమ్మీ అని, ఐపీఎల్ బెట్టింగ్ అని, ఫ్రీ మనీ ఎర్నింగ్ యాప్స్ అని ఎన్నో సైట్స్, యాప్స్ ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో చాలా మంది ఆన్?లైన్? గేమ్స్?ను సరదాగా మొదలుపెట్టి.. చివరికి అడిక్ట్?అయ్యి, బయటపడలేక జీవితం కరాబ్? చేసుకుంటున్నారు. కొందరికి అవి ఆన్?లైన్? గేమ్స్? అని, క్రికెట్ బెట్టింగులు అని తెలియకుండానే ఊబిలో చిక్కుకుంటున్నారు. ఆన్?లైన్?లోనే అప్పులు సైతం దొరుకుతుండడం ఈ సమస్యను మరింతగా పెంచుతోంది. సిటీలు, టౌన్లలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్? కోర్సులు చదివే స్టూడెంట్స్?తోపాటు రూరల్? ఏరియాల్లోని నిరుద్యోగ యువకులు ఆన్?లైన్? గేమ్?లకు అడిక్ట్ అవుతున్నారు.లాక్ డౌన్ టైంలో చాలా మంది ఆన్?లైన్? గేమ్స్ ఆడటంపై ఇంట్రెస్ట్? చూపారు. క్రమంగా అవే గేమ్ లపై బెట్టింగ్?లు కాసే స్థాయికి అడిక్ట్? అయ్యారు. డబ్బులు డిపాజిట్ చేసి గేమ్ ఆడితే సంపాదించవచ్చన్న ఆశలతో అప్పులు చేశారు. సాధారణంగా ఇలాంటి ఆన్? లైన్? పెయిడ్? గేమ్స్, బెట్టింగ్?లను ఆర్గనైజ్? చేసేవాళ్లు మొదట్లో కావాలనే కొంత డబ్బును యూజర్లు గెలుచుకునేలా చేస్తారు. దీంతో ఉత్సాహంగా మరింత సొమ్ము తెచ్చి గేమ్స్? ఆడుతూ, బెట్టింగ్? కడ్తుంటారు. డబ్బులు పోగొట్టుకున్నా మళ్లీ రాకపోతాయా అని ప్రయత్నిస్తుంటారు. ఇలా నిండా మునిగిపోతుంటారు. కొద్దిరోజులుగా రాష్ట్రంలో చాలా మంది యూత్? ఇలాగే నష్టపోయారు.ఆన్?లైన్? గేమింగ్ కంపెనీలు వివిధ రకాల యాప్ లు, వెబ్ సైట్ ల ద్వారా బిజినెస్ చేస్తున్నాయి. ఇప్పుడు గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పేలలో కూడా గేమ్స్ అందుబాటులోకి వచ్చాయి. కొన్ని సంస్థలు క్విజ్ గేమ్స్ ద్వారా గేమర్స్ కి మనీ ఇస్తున్నాయి. ఆన్?లైన్?రమ్మీ వంటి గేమ్ లకు 50 రూపాయల నుంచి కూడా డబ్బు పెట్టి చాన్స్ ఉంటుంది. ముందు కొంత అమౌంట్ గేమ్ ఆడేవారి అకౌంట్లోకి వస్తుంది. దీంతోపాటు గేమ్ ల రివార్డ్స్? ఇస్తూ ఆకర్షిస్తుంటారు.సూర్యాపేట జిల్లా మోతె మండలం హుస్సేనాబాద్?కు చెందిన 24 ఏండ్ల అరె నవీన్ రెడ్డి ఆన్?లైన్ బెట్టింగ్ లో సుమారు రూ.కోటి వరకు పోగొట్టుకున్నాడు. ఆ అప్పులు తీర్చేందుకు అడ్డదారులు తొక్కాడు. తెలిసినవాళ్ల మొబైల్స్? నుంచి సైబర్ క్రైమ్?లకు పాల్పడ్డాడు. పోలీసులు అతడిపై కేసు పెట్టారు. ఈ అవమానం భరించలేక నవీన్ రెడ్డి తండ్రి వెంకట్?రెడ్డి సూసైడ్? చేసుకున్నారు. ఆయన కుటుంబసభ్యులు భూములమ్మి అప్పులు తీర్చేసి.. ఊరు విడిచిపెట్టి వెళ్లిపోయారు మహబూబ్?నగర్? మెట్టుగడ్డ ప్రాంతంలో చెకింగ్? చేస్తున్న పోలీసులకు బైకుపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఉదయ్ కుమార్, విశాల్ కుమార్, గొల్ల గోపాల్ అనే ముగ్గురు యువకులు చిక్కారు. దర్యాప్తులో ఆ ముగ్గురూ క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడి.. చైన్? స్నాచింగ్? లకు పాల్పడుతున్నట్టు తేలింది. పోలీసుల వారి నుంచి 13 తులాల బంగారు గొలుసులు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నారు.మెదక్ మండలం మక్తభూపతిపూర్ కు చెందిన జియ్యారి మహేశ్ (22) కు ఆరునెలల కిందే పెళ్లయింది. మొదట్లో ప్రైవేట్? జాబ్? చేసిన అతను.. తర్వాత ఖాళీగా ఉంటూ ఆన్?లైన్? గేమ్స్?కు బానిసయ్యాడు. క్రికెట్? బెట్టింగ్ లో లక్ష రూపాయలకు పైగా పోగొట్టుకున్నాడు. ఈ విషయం తెలిసి తండ్రి మందలించడంతో గత నెల 9న చెరువులో దూకి సూసైడ్? చేసుకున్నాడు.మెదక్ జిల్లా నర్సాపూర్ కు చెందిన శ్రవణ్ కుమార్ (24) అనే యువకుడు క్రికెట్? బెట్టింగ్?కు అలవాటుపడ్డాడు. ఆన్ లైన్?లో రూ. 60 వేలు లోన్? తీసుకొని మరీ గేమ్? ఆడాడు. డబ్బంతా పోవడంతో అప్పు కట్టలేకపోయాడు. కానీ అప్పు తీర్చాల్సిందేనంటూ సదరు ఆన్?లైన్? కంపెనీ వాళ్ల నుంచి ఒత్తిడి పెరగడంతో.. విషయం ఇంట్లో తెలుస్తదని భయపడి ఉరివేసుకొన్నాడు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని మోదెలకు చెందిన తోట మధుకర్ (24) హైదరాబాద్ లో బీటెక్ ఫైనలియర్ చదువుతూ.. ఫ్రెండ్స్ ద్వారా ఆన్?లైన్? గేమ్స్, బెట్టింగులకు అలవాటు పడ్డాడు. అప్పులు చేసి 5 నెలల్లో 15 లక్షలు పోగొట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న తండ్రి ఆ అప్పులు చెల్లించేసినా.. తప్పుచేసిన భావనతో మధుకర్? కుంగిపోయాడు. మనస్తాపంతో జూలై 7న పురుగుల మందుతాగాడు. నాలుగు రోజుల తర్వాత చనిపోయాడు.కరీంనగర్? కార్పొరేషన్? పరిధిలోని కోతిరాంపూర్ కు చెందిన నితీశ్ (22) బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. లాక్ డౌన్ లో ఇంటి వద్దే ఉంటూ క్రికెట్? బెట్టింగ్?కు అలవాటుపడ్డాడు. ఇంట్లో వాళ్లకు తెలియకుండానే లక్షల్లో అప్పులు చేసి డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపం చెంది సెప్టెంబర్ 11న కాకతీయ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

# ఇంకా లెక్కల్లోనే గ్రేటర్ అభ్యర్థులు

హైదరాబాద్, డిసెంబర్ 9, :గ్రేటర్ ఎన్నికల వేడి ఇంకా తగ్గలేదు. ఫలితాలు వచ్చి 6 రోజులు దాటినా ఓటింగ్ తీరుపై నేతలు ఆరా తీస్తూనే ఉన్నారు. గెలుపోటములపై క్యాండిడేట్లు లెక్కలు వేసుకుంటున్నారు. డివిజన్ పరిధిలో వచ్చిన ఓట్లు, సామాజిక వర్గాలు, ప్రాంతాలపై సమీక్షించుకుంటున్నారు. ఎన్నికలు, ఫలితాలకు మధ్య మూడు రోజుల గ్యాప్ వచ్చినప్పుడే పార్టీలు వాటి స్థితిగతులపై అంచనాకు వచ్చినా, రిజల్ట్స్ తర్వాత అవన్నీ మారిపోయాయి. దీంతో గెలిచిన క్యాండిడేట్స్ కు అత్యధిక ఓట్లు పడ్డ కాలనీల వివరాలపై, ఓడిన క్యాండిడేట్ కు ఎక్కడ దెబ్బకొట్టిందనే విషయాలను తెలుసుకునేందుకు ఆయా పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. డివిజన్ లోని కాలనీలు, బూత్ ల వారీగా ఓట్లపై సమీక్షించుకుంటున్నారు. ఇక ఎన్నికల ఫలితాలు తారుమారైన డివిజన్లలో క్యాండిడేట్లకు బెడిసికొట్టిన అంశాలపై పరిశీలిస్తున్నారు. గెలిచిన క్యాండిడేట్లు ఓటర్లను కలుస్తుంటే..ఓడిన వారు ఓటమి కారణాలు, ప్రత్యర్థికి కలిసి వచ్చిన అంశాలను విశ్లేషించుకుంటున్నారు.గ్రేటర్?లో ఒక్కో డివిజన్ లో 50 కిపైగా బూత్ లు ఉన్నాయి. ఒక్కో బూత్ లో సగటున 550 మంది ఓటర్లు ఉంటారు. ఈ క్రమంలో పార్టీకి వచ్చిన ఓట్లు, ప్రత్యర్థి ఓట్లు వంటి అంశాలపై ఓడిన క్యాండిడేట్లు లోతుగా చర్చించుకుంటున్నారు. నల్లకుంట డివిజన్ టీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. ఇక్కడ 50 బూత్ లు ఉండగా, ఒక్కో బూత్ లో 700కు పైగా ఓట్లు ఉన్నాయి. పోలింగ్ రోజున 23,498 మంది ఓటేశారు.ఇందులో టీఆర్ఎస్ కు 9,523 ఓట్లు రాగా.. బీజేపీకి 12,779 మంది ఓటేశారు. 3,253 ఓట్ల మెజార్టీతో బీజేపీ క్యాండిడేట్ ఈ స్థానాన్ని దక్కించుకున్నారు. అయితే ఒక్కసారిగా 3 వేల ఓట్లు ఎక్కడ తగ్గాయంటూ ఓడిన క్యాండిడేట్ తలపట్టుకున్నట్లుగా సమాచారం. ముఖ్యంగా బస్తీల్లో నాలుగేళ్లలో పనులేవీ చేయకపోవడంతో ఆ ఓట్లు భారీగా చీలినట్లు ఆ పార్టీ కార్యకర్తలు చెప్తున్నట్టు సమాచారం. అదే విధంగా సోమాజిగూడ డివిజన్ టీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. ఇక్కడ బీజేపీ తరుఫున బరిలో దిగిన క్యాండిడేట్ కి 7,679 ఓట్లు వస్తే, టీఆర్ఎస్ దాదాపు 3 వేల ఓట్ల మెజార్టీతో గెలిచింది. ఈ డివిజన్ లో టీఆర్ఎస్ కు వ్యతిరేకత ఉందని తెలిసి బీజేపీ తమ క్యాండిడేట్ ను బరిలోకి దింపింది. కానీ ఆ క్యాండిడేట్ కు డివిజన్ పై పట్టు లేకపోవడంతో వెనుకబడినట్లుగా తేలింది. ముషీరాబాద్ లోని గాంధీనగర్ డివిజన్ ను బీజేపీ తన ఖాతాలో వేసుకుంది. ఇక్కడ టీఆర్ఎస్ ఓటమికి గల కారణం డివిజన్ లోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ బూత్ లేనని అంచనాకు వచ్చారు. 80 బూత్ లలో టీఆర్ఎస్ కు అనుకూలంగా పోలైన ఓట్లలో 38శాతం మాత్రమే. 50 శాతానికి పైగా ఓట్లు అంటే దాదాపు ఉన్న 15 బస్తీలన్నీ బీజేపీ వైపు నిలిచాయని బూత్ కమిటీ మీటింగ్ లో స్పష్టమైంది.రాంనగర్ డివిజన్ లో టీఆర్ఎస్ ఓడిపోవడానికి కారణం.. 3వేల మంది ఓటర్లున్న 4 బస్తిలు ముషిరా బాద్ డివిజన్ లో కలవడమేనని ఆ పార్టీ శ్రేణుల విశ్లేషణలో తేలినట్లు తెలిసింది. ఇప్పటికే గెలిచిన క్యాండిడేట్లు సంబురాల్లో ఉన్నారు. బీజేపీ క్యాండిడేట్లు రెట్టించిన ఉత్సాహంతో డివిజన్ లోని కాలనీల్లో పర్యటిస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ గెలిచిన స్థానాల్లో టీఆర్ఎస్ నేతలు తగ్గిన ఓట్లపై ఆరా తీస్తున్నారు. ముషీరాబాద్ సెగ్మెంట్ లో ఓడిపోయిన కార్పొరేటర్ ఓట్లు పడని బస్తీల వివరాలను సేకరించాలని నిర్ణయించారని తెలిసింది. ఓట్లను బేరీజు వేసుకుంటూ వచ్చే ఎన్నికల్లో ఓట్లు పడని బూత్ లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పార్టీ నేతలు డివిజన్ ఇన్?చార్జిలకు సూచించారు.

## కేంద్రం ప్రతిపాదనను తిరస్కరించిన రైతులు

సంబంధించి రైతుల ఆందోళనలపై అవసరమైన అన్ని వివరణలను వారికి అందజేయడానికి సిద్ధంగా ఉన్నట్టు కూడా కేంద్రం తెలిపింది. అయితే, చట్టాలను రద్దు చేయాలంటూ రైతు సంఘాల ప్రధాన డిమాండ్‌ను మాత్రం ఈ ప్రతిపాదనలో ప్రభుత్వం ప్రస్తావించలేదు. కొత్త చట్టాలతో మండీలు బలహీనమవుతాయన్న రైతుల ఆందోళనను ప్రస్తావిస్తూ, మండీలకు వెలుపల కార్యకలాపాలు సాగిస్తున్న ట్రేడర్ల రిజిస్ట్రేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టేలా సవరణలు తేవచ్చని పేర్కొంది. పన్నులు, సెస్ విధించవచ్చని తెలిపింది.'రైతుల ఆందోళనలను ఎలాంటి అరమరికలు లేకుండా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రైతుల పట్ల ఎంతో గౌరవభావంతో ఉంది. రైతు సంఘాలు తమ ఆందోళనను విరమించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది' అని రైతులకు లిఖిత పూర్వకంగా పంపిన ప్రతిపాదనలో కేంద్రం పేర్కొంది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ ద్వారా ఈ ప్రతిపాదనను ఆందోళనలు సాగిస్తున్న రైతులకు కేంద్రం అందజేసింది.

## ముందుగా అమెరికన్లకే వ్యాక్సిన్: ట్రంప్

ఎన్నికైన జో బైడెన్ ఆరోపిస్తున్నారు. ట్రంప్ వ్యాక్సిన్ పంపిణీ విధానాల గురించి చెబుతున్న సమయంలోనే బైడెన్ కూడా దీనిపై స్పందించారు. కాంగ్రెస్ అత్యవసరంగా వ్యాక్సిన్ తయారీ కోసం ఫండ్స్ రిలీజ్ చేయాల్సిన అవసరం ఉన్నదని బైడెన్ స్పష్టం చేశారు. లేదంటే అమెరికన్లు వ్యాక్సిన్ కోసం నెలల తరబడి వేచి చూసే ప్రమాదం ఉన్నదని ఆయన హెచ్చరించారు. తాను అధికారం చేపట్టిన తర్వాత తొలి వంద రోజుల్లోనే 10 కోట్ల మందికి వ్యాక్సిన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తామని బైడెన్ తెలిపారు. జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## తాయిలాల పనిలో కేటీఆర్

ఖమ్మం, డిసెంబర్ 9, : దుబ్బాక, జీహెచ్?ఎంసీ ఎన్నికల రిజల్ట్స్? ఎఫెక్ట్? రాబోయే ఎన్నికల మీద పడకుండా రాష్ట్ర సర్కారు ఇప్పటి నుంచే ఎత్తులు వేస్తున్నది. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నది. ఎన్నికలు జరిగే ఏరియాలకు తాయిలాలు ఇవ్వడం మొదలుపెట్టింది. నాగార్జున సాగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక ఉండటంతో గతంలో చెప్పిన హామీల్లో కొన్నింటిని అమలు చేసేందుకు పూనుకుంది. ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్‌లకు కొత్త ఏడాదిలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో అక్కడా కొత్త పనులకు పచ్చ జెండా ఊపింది. ఐటీ పార్కులను ప్రారంభించి యువతలో ఉన్న వ్యతిరేకతను తగ్గించుకోవాలని చూస్తోంది.టీఆర్ ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చి రెండేండ్లు పూర్తవుతుండటంతో ఇకపై జరిగే ప్రతి ఎన్నిక కీలకమేనని పార్టీ పెద్దలభావిస్తున్నారు. హుజూర్ నగర్ ఉప ఎన్నికలో విజయంతో ఊపుమీద కనిపించిన టీఆర్ ఎస్ కు దుబ్బాక ఓటర్లు చుక్కలు చూపించారు.జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్టపోయింది అన్నట్టుగా 55 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వరుసగా రెండు ఎన్నికల్లోవచ్చిన ప్రతికూల ఫలితాలతో రాబోయే ప్రతి ఎన్నికను సీరియస్ గా తీసుకుంటున్నారు. పాత హామీల అమలుకు ప్రయత్నిం చడంతో పాటుస్థాని కంగా కొన్ని పనులకు శంకుస్థాపనలు చేయాలని చూస్తున్నారు.



అంబేడ్కర్ రాజనీతి ఉద్యమం
Ambedkar Rajaneethi Movement (ARM)
www.ambedkarrajaneethi.com

బహుజనుల కోసం డిమాండ్లు
1. మద్యపానాన్ని నిషేధించాలి
2. మహిళలకు అన్నింటా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
3. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలి.
4. న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు కల్పించాలి.
5. వెనుకబడిన తరగతులకు చట్ట సభల్లో 50 - రిజర్వేషన్ కల్పించాలి.
6. ఎస్సీ లకు మత స్వేచ్ఛ కల్పించాలి.
7. బుద్ధుడు ప్రవచించిన సమతా భావాన్ని సమర్థించేలా చర్యలు చేపట్టాలి.
8. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని కులాలకు రిజర్వేషన్ కల్పించాలి.
9. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.
10. రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలి.
11. అందరికి ఉచిత విద్య కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టాలి.
12. ప్రైవేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి.
ఇప్పటికే ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలి.
13. ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం అందించాలి.
14. ప్రైవేట్ ఆస్పత్రులను రద్దు చేయాలి.
15. పరిశ్రమల్ని జాతీయం చేయాలి. ప్రైవేట్ రంగంలో నడిచే పరిశ్రమల్లో రిజర్వేషన్ కల్పించాలి.
16. ఆధార్ కార్డు ఉన్న ప్రతి పౌరుడికి 2,00,000/- రూపాయలు ఋణం ఇవ్వాలి.
సక్రమ చెల్లింపుపై తరువాత సంవత్సరం రెట్టింపు ఋణం ఇవ్వాలి.
17. భూమిలేని రైతులకు ప్రభుత్వ/దేవాలయ లేదా ఇతరత్రా ఏదైనా 4 ఎకరాల భూమి ఇవ్వాలి.
18. ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలి.
19. వలసలను అరికట్టేందుకు ఎక్కడికి అక్కడే గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త సాంకేతిక వ్యవసాయ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
20. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చి సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి.
21. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలను ముందుగానే ప్రకటించాలి.

ఇటువంటి విలువైన అంశాలు ఇంకా ఏవైనా ఉంటే దయచేసి మా దృష్టికి తీసుకురండి.

ఆహ్వానం
అంబేడ్కర్ రాజనీతి ఉద్యమంలో భాగస్వాములుగా చేరేందుకు బహుజనులందరికీ ఆహ్వానం.
జై భీం, జై ఫూలే, జై బహుజన
సెంట్రల్ వర్కింగ్ కమిటీ
అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్

# ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 10, డిసెంబరు 2020

## రైతన్న ధర్మాగ్రహం ఓ ప్రమాదఘంటిక

ఢిల్లీని చుట్టుముట్టిన రైతులను చూస్తుంటే ఎన్నికల్లో గెలవడానికీ, పార్లమెంట్‌లో బిల్లులు ఆమోదించడానికీ, ప్రజల మనసులను చూరగొనడానికీ తేడా ఉన్నదని స్పష్టమవుతోంది. ఇవాళ రైతు ప్రతినిధులతో అయిదారుసార్లు చర్చలు జరపడానికి పూనుకుంటున్న మోదీ, బిల్లులు రూపొందించే ముందు ఇలాంటి చర్చలు సాగిస్తే ఎవరు వద్దనేవారు? ఇప్పటికైనా మోదీ సర్కార్ రెండడుగులు వెనక్కి వేసి ఆత్మవిమర్శ చేసుకుని భవిష్యత్ కార్యాచరణకు పూనుకోవాలి. ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయడం, ఎన్నికల్లో విజయం సాధించడం మొదలైన వ్యవహారాల్లో అవలంబించాల్సిన వ్యూహాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి, భారతీయ జనతా పార్టీకి ఒక స్పష్టమైన అవగాహన ఉన్నది. ఇప్పుడు ఢిల్లీ సరిహద్దుల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న నూతన వ్యవసాయ చట్టాల విషయంలో కూడా మోదీ సర్కార్‌కు ఒక స్పష్టత ఉన్నది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కనీస మద్దతు ధరను గతంలో ఉన్నదాని కంటే తగ్గించింది. రైతులకు కనీసమద్దతు ధరపై రాష్ట్రాలు బోనస్ ప్రకటించడంపై కూడా ఆంక్షలు విధించింది. దేశంలో వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే ఉత్పత్తి వ్యయాన్ని లెక్కగట్టి దానిపై 50 శాతం లాభం వచ్చే విధంగా కనీస మద్దతు ధర ఉండాలని స్వామినాథన్ కమిటీ చేసిన సిఫారసులను మోదీ ప్రభుత్వం పట్టించుకోకపోగా, వ్యవసాయ ఉపకరణాల ధరలు పెరుగుతున్న సమయంలో మద్దతు ధరను మరింత తగ్గించేందుకు పూనుకుంది. 2014లో అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే మోదీ ప్రభుత్వం బిజెపి ఎంపి శాంతాకుమార్ నేతృత్వంలో నియమించిన కమిటీ అసలు దేశంలో కనీస మద్దతు ధర కేవలం 6 శాతం రైతులకే ప్రయోజనం చేకూరుస్తున్నదని తీర్మానించింది. ఆహారధాన్యాల నిల్వలో ప్రైవేట్ సంస్థలకు వీలు కల్పించాలని, కనీస మద్దతు ధరపై బోనస్‌ను ఏ మాత్రం అనుమతించకూడదని, ఆహారధాన్యాల సేకరణతో పాటు అసలు మొత్తం మద్దతు ధర విధానాన్నే సమీక్షించాలని సిఫారసు చేసింది. 2018లో నీతి ఆయోగ్ 'వినూత్న భారతానికి వ్యూహం' అన్న పేరుతో ఒక డాక్యుమెంట్‌ను రూపొందించింది. ఈ డాక్యుమెంట్‌లోనే వ్యవసాయరంగానికి సంబంధించిన మార్కెట్ సంస్కరణలను సూచించింది. అసలు వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సిఏసిపి)నే రద్దు చేసి ఒక వ్యవసాయ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని, నిత్యావసర వస్తువుల చట్టాన్ని సవరించాలని, కనీస మద్దతు ధరను తీసేసి కనీస రిజర్వు ధరను ప్రవేశపెట్టాలని, కనీస మద్దతు ధరను పెంచడం అనేది రైతు సమస్యలకు ఒక సమగ్ర పరిష్కారం కానే కాదని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. '2022 కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం.' అని మోదీ చెప్పడానికి ఈ నివేదికలే ఆధారం. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయడం, కనీస మద్దతు ధర విధానానికి స్వస్తి చెప్పడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయగలమన్న ధీమా ఉంటే ఆ విషయమై విస్తృత చర్చ జరపాలి. ముందుగా సొంత పార్టీలో అంతర్గత చర్చ నిర్వహించాలి. పార్లమెంట్‌లో వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టాలి. వ్యవసాయం, వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీలు అనేవి రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి కనుక రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశాలు నిర్వహించాలి. జాతీయస్థాయిలో అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలి. రైతుల ప్రతినిధులను పిలిచి చర్చించాలి. ఒక వేళ పార్లమెంట్‌లో బిల్లులు ప్రవేశపెట్టదలుచుకుంటే ఆ బిల్లులను ముందుగా స్థాయీసంఘాల పరిశీలనకు పంపాలి. పీవీ నరసింహారావు హయాంలో ఎరువుల సబ్సిడీ ఎత్తివేయాలని నిర్ణయించినప్పుడు జనతాదళ్ నేత దేవెగౌడ వెల్‌లోకి వచ్చి ధర్నా చేశారు. 'ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఎజెండాను అమలు చేస్తున్నారు..' అని బిజెపి నేత వాజపేయి విమర్శించారు. అప్పుడు పివి ఒక కమిటీ వేసి దేవెగౌడతో పాటు పలువురు ప్రతిపక్ష సభ్యులను కూడా కమిటీలో చేర్చి చివరకు తాను అనుకున్న నిర్ణయాన్నే అమలు చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో విస్తృత చర్చలు జరిపి అందర్నీ ఒప్పించారు. కానీ మోదీ ప్రభుత్వం ఇవేమీ చేయలేదు. మొదటిసారి కన్నా రెండవ సారి పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక తమకు అడ్డేమీ లేదన్న ధీమాతో వ్యవహరిస్తోంది. కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు, పౌరసత్వ చట్టం వంటివి సరే సరి, రాష్ట్రాల్లో తాము ఎన్నికల్లో గెలవకున్నా ఏదో ఒక మార్గంలో ప్రభుత్వాలను కూలద్రోసి అధికారంలోకి వచ్చే మార్గాలపై దృష్టి కేంద్రీకరించింది. దేశ ప్రజల జీవితాలపై, రాష్ట్రాల అధికారాలపై ప్రభావం పడుతుందని తెలిసినా ఇష్టారాజ్యంగా పార్లమెంట్‌లో బిల్లులను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించుకునేందుకు దూకుడుగా వ్యవహరించింది. బలహీనమైన ప్రతిపక్షాలను అసలు లెక్కచేయకపోగా, కొన్ని ప్రాంతీయపార్టీలను లొంగదీసుకుని ఎటువంటి నిర్ణయమైనా అవలీలగా అమలు చేయగలమన్న అతి ఆత్మ విశ్వాసంతో వ్యవహరించింది. చివరకు కరోనా సమయంలో దేశమంతటా అట్టుడికిపోతున్న సమయంలో ఏదో కొంపలు మునిగినట్లు గత జులైలోనే వ్యవసాయ బిల్లులకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. అప్పటి నుంచి రైతులు తమ నిరసనను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. పంజాబ్, హర్యానా రైతుల్లో కదలిక ప్రారంభమైంది. సెప్టెంబర్‌లో కేవలం 11 రోజుల పాటు పార్లమెంటు సమావేశాలు ఏర్పాటుచేసి దూకుడుగా వ్యవసాయ బిల్లులతో పాటు అనేక కీలక బిల్లులను ఆమోదించారు. అప్పుడు కూడా రైతులు జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేసినా పట్టించుకోలేదు. బిల్లులకు వ్యతిరేకంగా పంజాబ్ అసెంబ్లీ తీర్మానాన్ని కూడా ఆమోదించింది. ఆఖరుకు తన కూటమిలో భాగస్వామి అయిన శిరోమణి అకాలీదళ్ తప్పుకుని తమ మంత్రితో రాజీనామా చేయించినా మోదీ ఏ మాత్రం చలించలేదు. గత సెప్టెంబర్ 14న కేంద్ర వ్యవసాయమంత్రి నరేంద్రసింగ్ తోమర్ లోక్‌సభలో వ్యవసాయానికి సంబంధించిన మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. ఆ బిల్లులను ప్రవేశదశలోనే ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. నిజానికి. వ్యవసాయం అనేది రాష్ట్రాలకు సంబంధించిన అంశమని ప్రతిపక్షాలు అభ్యంతరపెట్టాయి. అసలు ఈ బిల్లులను ఆమోదించేందుకు చట్టపరమయిన అర్హత పార్లమెంట్‌కు లేదని వాదించాయి. రాష్ట్రాల జాబితాలోని అంశంపై రాష్ట్ర శాసనసభలకే చట్టాలు చేసే అధికారం ఉంటుందని రాజ్యాంగంలోని 246(3) అధికరణ స్పష్టంగా చెబుతోంది. మొత్తానికి ఈ బిల్లులు వ్యవసాయానికి మృత్యుఘంటికలుగా మొత్తం ప్రతిపక్ష సభ్యులందరూ విమర్శించినా స్పీకర్ త్రోసిపుచ్చారు. కావాలంటే బిల్లులపై చర్చ సమయంలో మాట్లాడమని వారికి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17న లోక్‌సభలో అయిదు గంటల్లో చర్చను ముగించి బిల్లులను ఆమోదింపజేశారు అప్పటివరకూ మిత్రపక్షంగా ఉన్న అకాలీదళ్ నేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌ను పూర్తిగా మాట్లాడనివ్వలేదు. సభ్యులు వేసిన అనేక కీలక ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇవ్వలేదు. సెప్టెంబర్ 20న రాజ్యసభలో చర్చ జరిగినప్పుడు కాంగ్రెస్, టిఆర్ఎస్‌తో 12 ప్రతిపక్ష పార్టీల సభ్యులు బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని అభ్యర్థిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తిరస్కరించారు. మోదీ ప్రభుత్వ వైఖరిని ఏమనుకోవాలి? ప్రతిపక్షాలన్నా, ప్రజలన్నా, రైతులన్నా, రాజ్యాంగమన్నా లెక్కలేదనుకోవాలా? ప్రతిపక్షాలు అత్యంత బలహీనంగా ఉన్న సమయంలో ఎన్నికల్లో తిమ్మినిబమ్మి చేసి గెలిచినంత మాత్రాన అప్రజాస్వామికంగా ఏ చర్యలైనా తీసుకోగలమని భావిస్తే ఏమి జరుగుతుందో ఇవాళ ఢిల్లీని చుట్టుముట్టిన రైతులను చూస్తుంటే అర్థమవుతోంది.

ఎన్నికల్లో గెలవడానికీ, పార్లమెంట్‌లో బిల్లులు ఆమోదించడానికీ, ప్రజల మనసులను చూరగొనడానికీ తేడా ఉన్నదని స్పష్టమవుతోంది. కొంకర్లు తిరిగే చలిని కూడా లెక్కచేయకుండా లక్షలాది రైతులు దేశ రాజధానిని నలుమూలలా చుట్టుముట్టడం ఒక ఎత్తు అయితే ఏ రాజకీయ పార్టీని కూడా తాము తమ వేదికపై ఆహ్వానించబోమని చెప్పడం మరో ఎత్తు. ప్రజలకు రాజకీయ పార్టీల పట్ల విశ్వాసం లేకపోవడం అనేది ప్రతిపక్షాలకు స్పష్టమైన సంకేతాలను పంపిస్తోంది. ప్రతిపక్షాలు లేకపోయినా ప్రజలు వీధుల్లోకి వచ్చే పరిస్థితి వస్తే ఎన్నికల్లో విజయాలు, పార్లమెంట్‌లూ, పోలీస్‌స్టేషన్లు, ఇతర వ్యవస్థలు అర్థరహితంగా మారినట్లే. రైతులతో పాటు నిరుద్యోగులు, కార్మికులు, ఇతర వర్గాలు కూడా ఇదే విధంగా స్పందిస్తే, ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాలకే కాదు, ఇతర రాష్ట్రాలకు కూడా ఇలాంటి ఆందోళనలు వ్యాపిస్తే అదుపు చేయడం అంత సులభం కాదు. ఇది మోదీ సర్కార్‌కు ప్రమాద ఘంటికలను సూచిస్తోంది. ఇవాళ రైతు ప్రతినిధులతో అయిదారుసార్లు చర్చలు జరపడానికి పూనుకుంటున్న మోదీ బిల్లులు రూపొందించే ముందు ఇలాంటి చర్చలు సాగిస్తే ఎవరు వద్దనేవారు? మోదీ ప్రభుత్వం తరఫున ఇలాంటి సమస్యలను చర్చించడానికి తగిన రాజనీతిజ్ఞులు, తలపండినవారు లేరు. అసలు ప్రశ్నించే ధైర్యం లేకుండా ఇద్దరు పెద్ద మనుషులు ఏమి నిర్ణయించినా దూడూ బసవన్నల్లాగా తల ఊపేవారుంటే ఏది మంచిదో, ఏది కాదో, ఏ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో ఎలా తెలుస్తుంది? ఇప్పటికైనా మోదీ సర్కార్ రెండడుగులు వెనక్కి వేసి ఆత్మవిమర్శ చేసుకుని భవిష్యత్ కార్యాచరణకు పూనుకోవడం అవసరం. ఇంత వేడి రగిలినా ప్రతిపక్షాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్‌లో కాక రాకపోతే అవి ఉన్నా లేనట్లే లెక్క.

## ఊరి మధ్యలో దళితుల నివాసం సాధ్యమేనా!

మన దేశంలోని గ్రామాల నిర్మాణ చట్రాన్ని పరిశీలిస్తే దళితుల నివాసాలు ఎప్పుడూ ఊరికి దక్షిణ దిశగానే నిర్జీవంగా పడి ఉంటాయి. అదొక తిరుగులేని మనుధర్మ శాసన ఆజ్ఞ. మరి ఇటీవల నాగర్ కర్నూల్ జిల్లా, ఎల్లమ్మ రంగాపూర్ గ్రామంలో రగులుకున్న వివాదం పరిష్కృతమై దళితులు ఊరి మధ్యలో ఇల్లు కట్టుకుంటే, చరిత్ర పొడవునా శాసిస్తున్న మనుధర్మశాస్త్రం మౌనంగా ఉంటుందా? మనదేశంలోని గ్రామాల నిర్మాణ చట్రాన్ని పరిశీలిస్తే దళితుల నివాసాలు ఎప్పుడూ ఊరికి దక్షిణ దిశగానే నిర్జీవంగా పడి ఉంటాయి. అదొక తిరుగులేని మనుధర్మ శాసన ఆజ్ఞ. ఈ శాసనం ప్రకారం జరిగిన గ్రామ నిర్మాణాన్ని ఈ దేశంలో ఇప్పటి వరకు చెల్లాచెదురు చేసి పునర్నిర్మాణం ఎవరూ చేయలేదు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఎల్లమ్మ రంగాపూర్ గ్రామంలో ఊరికి నడిబొడ్డున స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఓ కోట నిర్మితమై ఉంది. ఈ కోట దొరలకు చెందినది. ఆ ఊర్లో దొరలంటే రెడ్డి కులానికి చెందినవారు. కాలగమనంలో ఆ కోట భూమిలో ఒదిగి పోయింది. దొరలు వారసత్వంగా సంక్రమించిన భూమిని ఇతరులకు అమ్ముకున్నారు. ఎకరన్నర భూమిని మాత్రం వారి కుటుంబాలకు సేవ చేసిన దళితులకు ఇరవై సంవత్సరాల కింద ఇనాం కింద రాసిచ్చారు. భూదాన పత్రంపై గాంధీ జయంతి 2001 నాడు సంతకాలు చేసి ఇచ్చారు. దళితుల సేవలను గుర్తించి వారికింత భూమిని శాశ్వతంగా యివ్వడం గొప్ప ఔదార్యం. అది కూడా ఊరికి దూరంగా గాక నడిబొడ్డున రాచరిక అధికారం చెలాయించిన కోటలో ఇవ్వడం అభినందించాల్సిన అంశం. బొల్లె ఎట్టయ్య బొల్లె పరుశురాములు, బొల్లె చిన్న పరుశురాములు, అంకూరి కృష్ణయ్య, గుమ్మకొండ కాశయ్య, అంకూరి బాలయ్య, తాతెర పోషమ్మ, మేకల ఎల్లమ్మ, నిరంజన్, తదితరులు భూదాన గ్రహీతలు. భూదానం పొందిన వీరు కాని, కొనుగోలుదారులు కాని ఇరవై సంవత్సరాలు గడిచినా ఎవరూ అక్కడ ఇళ్లు కట్టుకోలేదు. అందుకని భూమి మొత్తం పాడుబడి గుబురైన ముళ్లకంపలు, చెట్లతో నిండిపోయి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రకృతి వనం నిర్మించ తలపెట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ చింత ఝాన్సీ గ్రామ కంఠభూమిని గుర్తించమని తహసీల్దారును 2020, మే 5న అభ్యర్థించింది. ఈ విన్నపం మేరకు తహసీల్దారు జులై 13న సర్వే నిర్వహించి కోట ప్రాంగణంలో 20 గుంటలు గ్రామకంఠం భూమిగా గుర్తించి అక్కడ ప్రకృతి వనం నిర్మించాలని సూచించారు. ఆరెకరాల భూమిలో కేవలం 20 గుంటలు మాత్రమే గ్రామకంఠంగా గుర్తించడమే చిత్రం. ఈ మేరకు సర్పంచ్ ఝాన్సీ ఆగస్టు 13న మెంబర్లతో సమావేశం నిర్వహించి సదరు భూమిలో ప్రకృతి వనం నిర్వహించాలని తీర్మానం చేశారు. విషయం తెలుసుకున్న భూస్వాములు గున్న ఆనంద్‌రెడ్డి, నర్సింహారెడ్డి తమ భూమిలో ప్రకృతి వనం ఎలా నిర్మిస్తారని ఆగ్రహించారు. వారి సామాజిక వర్గానికి, మాల సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ ఝాన్సీకి చాలా కాలం నుంచి కక్షలు కొనసాగుతున్నాయి. ఝాన్సీ సీపీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలిచింది. రెడ్డి సామాజిక వర్గీయులు అధికార పార్టీ టీఆర్ఎస్‌కు చెందినవారు. 2019 సర్పంచ్ ఎన్నికల్లో వైషమ్యాలు తారస్థాయికి చేరుకున్నాయి. మహిళ కాబట్టి, అందులోనూ దళిత మహిళ కాబట్టి, సర్పంచిగా ఆమె తలపెట్టిన ప్రతి పనికి అడ్డు తగులుతూ వచ్చారు. వారికి అధికార పార్టీ అండదండలున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం బాసటగా ఉంది. దాంతో వారు ముందు జాగ్రత్తగా ఆ భూమిలో జెసిబిలతో కంపచెట్లను తొలగించి చదును చేయడం మొదలు పెట్టారు. విషయం తెల్సుకున్న సర్పంచ్ ఝాన్సీ సిబ్బందితో అక్కడికెళ్ళి అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఒక దళిత మహిళ తమను అడ్డుకోవడం జీర్ణించుకోలేని ఆనంద్‌రెడ్డి కులం పేరుతో బూతులు తిట్టాడు. ఆమె ఇంకా ముందుకు కదిలితే ఆమెను పడదోసి భూమిలో దున్నేయమని డ్రైవరును పురమాయించాడు. సర్పంచ్ ఝాన్సీ చేష్టలుడిగి చేసేది లేక వెనుదిరిగింది. పోలీస్ స్టేషన్ వెళ్ళి కులం పేరుతో దూషించారని ఎస్సీ, ఎస్టీ చట్టం కింద దోషులను శిక్షించాలని ఫిర్యాదు చేసింది. అధికార పార్టీ ఆదేశాలున్న పోలీసులు ప్రాథమిక ఆధారాలు లభ్యం కాలేదనే నెపంతో ఎవరినీ అరెస్టు చేయలేదు. మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టాలని తలపోశాడో, లేక ఎస్సీ ఎస్టీ కేసుల నుంచి తప్పించుకునే మార్గంగా తలంచాడో, లేక నిజంగానే సహాయం చేయాలనుకున్నాడో తెలీదుగానీ– మరుసటి రోజు ఆనంద్‌రెడ్డి భూదాన గ్రహీతలైన ఎనిమిదిమంది మాదిగ కుటుంబాలను పిలిచి వారికి దానంగా ఇచ్చిన భూమిలో వెంటనే గుడిసెలు వేసుకోండని పురమాయించాడు. భూదాన పత్రాలను కూడా చేతిలో పెట్టాడు. పత్రాన్ని తీసుకున్న మాదిగలు నేరుగా తహసీల్దారు, ఆర్డీవో దగ్గరకెళ్ళి తమ భూమిలో గుడిసెలు వేసుకుంటామని, గొడవలు జరగకుండా రక్షణ కల్పించాలని విన్నవించుకున్నారు. కాని తహసీల్దారు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. మరుసటి రోజు దళితులు గుడిసెలు వేసుకుంటుండగా సర్పంచ్ మెంబర్ల కుటుంబీకులు, ఇతర బీసీ కుటుంబీకులు, సిపిఎం పార్టీ సభ్యులు అక్కడికి చేరుకొని వేసిన గుడిసెలు పీకేశారు. ఇరువర్గాల మధ్య భౌతిక ఘర్షణ జరిగింది. సర్పంచ్ సామరస్యపూర్వకంగా చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి దాడికి మనుషులతో దిగింది. ఉన్నతాధికారులకు నివేదించాల్సింది పోయి గొడవను వ్యక్తిగత తగాదాగా మలిచింది. సర్పంచ్ అలా మారడానికి తండ్రి ఆంజనేయులు ఒత్తిడి అధికంగా వుంది. మాదిగ కులస్థులు పరశురాములు, ఎల్లయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, నరేష్‌లు గాయపడ్డారు. కృష్ణయ్య తలపైన పది కుట్లు పడ్డవి. తరువాత ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే మాదిగలకు స్టేషన్ బెయిల్ ఇచ్చి సర్పంచ్ వర్గీయులను ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టి జైలుకు పంపారు. ఈ మొత్తం ఘటనలు సర్పంచ్ ఝాన్సీని తీవ్ర ఆవేదనకు గురి చేశాయి. తను విద్యాధికురాలు. సర్పంచ్‌గా గెలిచి ఈ అధమ రాజకీయాల్లో ఇరుక్కుపోయానని పోయానని బాధపడింది. రెడ్డి వర్గీయులు సర్పంచ్‌గా ఆమె ప్రతి పనికి అడ్డు పడుతున్నారు. పోలీసులు పట్టించుకోవడం లేదు. తీవ్ర మానసిక ఆందోళనకు గురై నిద్రమాత్రలు మింగి ఆత్మ హత్యా ప్రయత్నం చేసింది. చివరికి ప్రాణాలతో బయటపడింది. సర్పంచ్ ఆత్మహత్యా ప్రయత్నంతో భయపడిన పోలీసులు వెంటనే ఆమె ఇచ్చిన మొదటి ఫిర్యాదు ఆధారంగా ఆనంద్‌రెడ్డి, నర్సింహారెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఒక్క పెత్తందారి దొర అరెస్టు అవ్వాలంటే ఒక దళిత స్త్రీ ప్రాణత్యాగానికి సిద్ధపడాలా ప్రజాస్వామ్య దేశంలో! ఇన్ని గొడవల మధ్య ఏ భూమినైతే భూదానం కింద దళితులకిచ్చామని చెబుతున్నారో ఆ భూమి తమకు దక్కాలని రెడ్డి వర్గీయులు హైకోర్టులో కేసు వేశారు. యథాతథ స్థితి కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును హైకోర్టు భవిష్యత్తులో విచారించి రెడ్లకు అనుకూలంగా తీర్పు ఇస్తే ఆ భూమిని వారే స్వాధీనం చేసుకుంటారా? లేక నిజంగా ఇరవై ఏళ్ల నాటి మాటకు కట్టుబడి ఉంటారా? దళితులకు రాసి ఇచ్చిన భూమిని వారికే ఇస్తే వారు ఊరి మధ్యలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తారా? దళితులు ఊరి మధ్యలో ఇల్లు కట్టుకుంటే చరిత్ర పొడుగునా శాసిస్తున్న మనుధర్మ శాస్త్రం మౌనంగా ఉంటుందా?




## పాకిస్థాన్ పై అరబ్‌ల ఆగ్రహం




ఇచ్చిన అప్పును తీర్చమని సౌదీ అరేబియా ఒత్తిడి చేస్తుండగా, పాకిస్థాన్‌కు నూతన వీసాల జారీని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నిలిపివేసింది. యుఏఇ చర్య పాకిస్థాన్ ఆర్థిక పట్టుగొమ్మలను విరిచింది. గల్ఫ్ దేశాలలో భారతీయులకు అన్నింటా ప్రధాన పోటీదారులు పాకిస్థానీయులే. అయితే, వారు తమ ప్రభావాన్ని క్రమేణా కోల్పోతూ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో వెనుకబడిపోతున్నారు. గల్ఫ్ దేశాలలో, సగటు కార్మికుడి నుంచి మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ వరకు అన్నిస్థాయిలలో భారతీయులు, పాకిస్థానీయుల మధ్య పోటీ కద్దు. భారతీయులతో పోల్చితే పాకిస్థానీయుల విద్యార్హతలు, వృత్తి నైపుణ్యాలు అధికమైనవి, ఉన్నతమైనవి కావు. అయినప్పటికీ మనవారితో వారు బాగా పోటీపడేవారు. గల్ఫ్‌లోని ఆరు దేశాలలో ఎక్కడైనా సరే పాకిస్థానీయులు తమ బంధువుల ఇంటికి వచ్చినట్లుగా వ్యవహరించడం పరిపాటి. పాకిస్థాన్‌కు, ఈ ఎడారి దేశాలకు మధ్య ఉన్నతస్థాయి రాజకీయ, సైనిక సంబంధాలు ఉండడమే అందుకు కారణమని చెప్పవచ్చు. పాక్ పౌర పాలకుల కంటే సైనిక పాలకులే ఈ సన్నిహిత సంబంధాల నిర్మాణంలో కీలకపాత్ర వహించారు. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో కుదిరిన ఒక సైనిక సహాయక ఒప్పందం గల్ఫ్ దేశాలతో ఇస్లామాబాద్ సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలకు పునాది. అఫ్ఘానిస్థాన్‌లో అమెరికా, గల్ఫ్ దేశాల సహాయంతో జిహాద్‌ను పెంచిపోషించగా అందుకు పాకిస్థాన్ వేదిక అయింది. ఈ రాజకీయ నేపథ్యం పాకిస్థానీయుల ఆభిజాత్యానికి ఆలంబన అయింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత అఫ్ఘానిస్తాన్‌లో జిహాదీ ఉగ్రమూకలకు అమెరికా సహాయం నిలిపివేసింది. మరో వైపు గత రెండు దశాబ్దాలుగా భారత్‌లో శరవేగంగా పెరుగుతున్న చమురు వినియోగం గల్ఫ్ దేశాల ఆలోచనా విధానంలో మార్పు తీసుకువచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ల దౌత్య ప్రజ్ఞతో గల్ఫ్ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సంబంధాలు ఇతోధికంగా మెరుగుపడ్డాయి. కశ్మీర్ విషయంలో దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు అండగా ఉన్న గల్ఫ్ దేశాలు, ప్రత్యేకించి యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, సౌదీ అరేబియాలు తమ వైఖరిని మార్చుకున్నాయి. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడంపై ఇస్లామిక్ దేశాల సమాఖ్య (ఓ.ఐ.సి) ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలన్న పాకిస్థాన్ విజ్ఞప్తిని సౌదీ అరేబియా పట్టించుకోలేదు. ఇస్లామిక్ దేశాలలో నాయకత్వం కోసం సౌదీ అరేబియాతో పోటీపడుతున్న టర్కీ, ఇంకా ఇతర దేశాలతో కలిసి తాము వేరుగా సమావేశం నిర్వహిస్తామని చెప్పడం ద్వారా సౌదీ అరేబియా నాయకత్వాన్ని పాకిస్థాన్ ప్రశ్నించింది. తమ పౌర ప్రభుత్వం చేసిన ఈ తప్పిదాన్ని సరి దిద్దేందుకు సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ ఖమర్ జావేద్ బాజ్వా సౌదీ అరేబియా యువరాజుతో సమావేశం కావడానికి రియాద్కు వచ్చారు. అయితే ఈ సమావేశం జరగలేదు. ఇజ్రాయేల్‌తో దౌత్య సంబంధాల విషయమై యు.ఏ.ఇ. పై పాక్ కొన్ని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ కారణాన యుఏఇ నాయకత్వం పాకిస్థాన్పై ఆగ్రహంతో ఉంది. ఇచ్చిన అప్పును తీర్చమని సౌదీ అరేబియా ఒత్తిడి చేస్తుండగా, పాకిస్థాన్‌కు నూతన వీసాల జారీని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నిలిపివేసింది. యుఏఇ చర్య పాకిస్థాన్ ఆర్థిక పట్టుగొమ్మలను విరిచింది. భారతీయులు తమ వృత్తి నైపుణ్యాలు, విధుల పట్ల నిబద్ధత, అంకిత భావం, అంతకు మించి స్నేహపూర్వక స్వభావం కారణాన తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇది కూడా బ్రాండ్ ఇండియా ప్రమోషన్‌కు విశేషంగా దోహదపడింది. ఈ నేపథ్యంలో ఇటీవల విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ దేశాలలో పర్యటించారు. భారతీయ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నార్వనే త్వరలో సౌదీ అరేబియా, యుఏఇ లలో పర్యటించనున్నారు. భారత్ పట్ల అరబ్ దేశాల వైఖరి ఇలా సానుకూలంగా మారడానికి న్యూఢిల్లీ పాలకుల దౌత్య ధురీణతే ప్రధాన కారణమని చెప్పక తప్పదు.

# పార్లమెంటులో బిసి బిల్లు పెట్టాలి

## రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి బి.ఆర్.కృష్ణ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 9 (ప్రజాపాలన) :** పార్లమెంటులో బిసి బిల్లు పెట్టి 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి బి.ఆర్. కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంటులో బిసి బిల్లు పెట్టాలని కోరుతూ కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ అధికారిణి హరితా దేవికి జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలకు సామాజిక వర్గాలకు రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో 56 శాతం బిసి జనాభా ఉన్నా ఇంతవరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా కులాలను అణిచి పెట్టాలని నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వివక్షకు గురైన వర్గాలను అన్ని రంగాలలో వాటా ఇచ్చి అభివృద్ధి కులాలతో సమానంగా చూడాలని సూచించారు. వికారాబాద్ జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదగిరి యాదవ్ మాట్లాడుతూ లోక్ సభలో బిసి బిల్లు పెట్టి 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ లో ఉన్న 14 పార్టీలు సంసిద్ధత వ్యక్తం చేశాయని గుర్తు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ పార్టీ టిడిపి డీఎంకె అన్నాడీఎంకె సమాజ్వాదీ రాష్ట్రీయ జనతాదళ్ జనతాదళ్ యునైటెడ్ కాంగ్రెస్ పార్టీ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అప్నా దళ్ లోక్దళ్ ఎస్ పి బి ఎస్ పి పార్టీలు బిసి బిల్లుకు మద్దతు ఇవ్వడానికి అంగీకరించాయని పేర్కొన్నారు. బిజెపి పార్టీ అంగీకరిస్తే బీసీ బిల్లు ఒక్కరోజులో పాసవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు కూడా బిజెపిని ఒప్పించండి మేము మద్దతు ఇస్తామని బిజెపి యేతర పార్టీలు కోరాయన్నారు. కానీ బిజెపి పార్టీ బీసీల పట్ల తమ విధాన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ బీసీ వర్గానికి చెందిన వారు కావడంతో బీసీలంతా ఆయన నిర్ణయం పై ఆశలు పెట్టుకున్నారని అన్నారు. నరేంద్రమోడీ హయాంలోనే బిసి బిల్లు పెట్టకపోతే చరిత్ర క్షమించదని హెచ్చరించారు. లోక్సభలో 94 మంది బీసీ లోక్సభ సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా మద్దతు ఇవ్వాలి లేకపోతే బీసీ వర్గానికి చెందిన లోక్సభ సభ్యులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కిరణ్ వర్కింగ్ ప్రెసిడెంట్ లాలయ్య ధారూర్ మండల బీసీ సంఘం కార్యదర్శి గొర్రెంక వెంకటయ్య జిల్లా యూత్ కార్యదర్శి హరికృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘటన జిల్లా యూత్ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## మతిస్థిమితం లేనివారికి ఆశ్రయం



**బాలాపూర్, ప్రజాపాలన న్యూస్ :** బడంగ్పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని నాదర్గుల్ గ్రామంలో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న మానసిక స్థితి సరిగ్గా లేని వృద్ధుడిని స్థానిక కార్పోరేటర్ ఇంద్రాసేన ఆధ్వర్యంలో మాతృదేవోభవ ఆశ్రమ వ్యవస్థాపకుడు ఇంత కరోన టైం లో కుడ గట్టు గిరి చేరదీసి ఆశ్రమంలో ఆశ్రయం కల్పించడం జరిగింది. అతనికి గుండు స్నానం చెయించి పునర్జన్మ తో కోత్త జివితం కల్పించారు. ఆశ్రమ వ్యవస్థాపకులు దాతలు అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం టౌన్ ప్రజా పాలన :** భద్రాద్రి హరిహర క్షేత్రం శ్రీ అయ్యప్ప స్వామివారి దేవాలయంలో కార్తీక బుధవారం పురస్కరించుకొని ఆలయంలో అభిషేకములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 100 మంది అయ్యప్ప దీక్షాపరులు ఇరుముడులు సమర్పించారు. బుధవారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా భద్రాచలం పట్టణ సీఐ స్వామి స్వామివారిని దర్శించుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వాములకు యాత్రికులకు భక్తులకు అన్నదానం జరిపించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆర్ ఎస్ ఎస్ ఎన్ రాజు. పరిమి శ్రీనివాస్. చారు గుండ్ల ఉమామహేశ్వరరావు. ఆకుల సత్తిబాబు మరియు భక్తులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలలో పాల్గొన్న ట్రాఫిక్ ఎస్ఐ జి సురేష్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం టౌన్ ప్రజా పాలన :** భద్రాచలం బ్రిడ్జి సెంటర్లో వాహనాలు తనిఖీల్లో భాగంగా పెండింగ్ చలానా కట్టనిబళ్ళ సీజ్ చేసి వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు వాహనం నడిపే యజమానులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పెండింగ్లో ఉన్న చలనాలు కట్టాలని ఎట్టి పరిస్థితిలో మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ. జి. సురేష్ మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యగిరి ఆలయంలో ఈనెల 11వ తేదీన స్వాతి కళ్యాణం

**వలిగొండ, ప్రజాపాలన :** మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో ఈ నెల 11 న ఉదయం 11 గంటలకు స్వాతి నక్షత్రం సందర్భముగా స్వామివారి కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఫైళ్ల



**వలిగొండ, ప్రజాపాలన :** మండల పరిధిలోని నాతల్లగూడెం గ్రామంలో టిఆర్ఎస్ నాయకుడు మాజీ ఎంపిటిసి ఉద్దగిరి భాస్కర్ తండ్రి ఉద్దగిరి నర్సింహా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ బుధవారం మృతి చెందడంతో స్థానిక శాసనసభ్యులు ఫైళ్ల శేఖర్ రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి అనంతరం మృతుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు డేగల పాండు యాదవ్ పిఎసిఎస్ చైర్మన్ సురకంటి వెంకటరెడ్డి,మోటే నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ ప్రధానిగా భారత దేశానికి చేసిన సేవలు మరువలేనివి



**వెల్గటూర్, డిసెంబర్ 9 (ప్రజా పాలన) :** వెల్గటూర్ మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద స్వర్గీయ భారత ప్రధాని ఇందిరా గాంధీ జన్మదిన వేడుకలు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వద్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరాగాంధీ ప్రధానిగా భారత దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఆయన అన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు తాటిపర్తి శైలజ రెడ్డి, స్థానిక సర్పంచ్ మేరకు మురళి గౌడ్, ఉప సర్పంచ్ గుండేటి సం దీప్ రెడ్డి, జిల్లా నాయకులు గుండేటి జితేందర్ రెడ్డి యువ నాయకుడు గంద్ర శ్రీకాంత్ రావు, సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షులు గొల్ల తిరుపతి, బందెల ఉదయ్ కుమార్, కొండాపూర్ ఉపసర్పంచ్ సింగతి వెంకటస్వామి, చెగ్యాం ఎం.పి టి.సి తిరుపతి,మెరుగు నరేష్ గౌడ్, జూపాక ప్రవీణ్ కుమార్, దావుల శశి, కొండ లక్ష్మీనారాయణ, గుమ్ముల అజయ్, కస్తూరి తిరుమలేష్, పూదరి రవి, పోలోజు శ్రీనివాస్, గుమ్ముల అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మణి శ్రావణి - సాయి సూర్య వివాహ మహోత్సవం

### హాజరయ్యి ఆశీర్వదించిన ఏలేటి రాం రెడ్డి, బోడ మనోహర్ నంద



**మెట్ పల్లి, డిసెంబర్ 9 (ప్రజాపాలన):** మెట్ పల్లి పట్టనకేంద్రం వాసవి గార్డెన్ లో గుండ నరేందర్ ప్రథమ పుత్రిక మణి శ్రావణి మరియు సాయి సూర్య వివాహము మణి శ్రావణి తాతగారైన గుండ గంగాధర్ ఆశీస్సులు ఆశీర్వధాలతో అత్యంత వైభవోపేతంగా ఘనంగా నిర్వహించారు. మహోత్సవానికి గుండ లవ కుమార్, లోక్ అధాలత్ సభ్యులు సీనియర్ న్యావాది ఏలేటి రాం రెడ్డి, వివేకానంద ఫౌండేషన్ చైర్మన్ మరియు ప్రజాపాలన జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బోడ మనోహర్ నంద, మార్కెట్ కమిటీ చైర్మన్ కదుర్క నర్సయ్య, జెడ్పిటిసి సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రంగు రామగౌడ్, ఏలేటి వెంకట్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి మరియు ప్రముఖులు పాలుగోని ఆహిర్వదించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పైళ్ల



**వలిగొండ, ప్రజాపాలన :** మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకుడు బత్తుల అచ్చయ్య గౌడ్ కుమారుని వివాహం మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగింది. ఈ వివాహానికి స్థానిక శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం శివ సాయి ఫంక్షన్ హాల్లో, సంగెం గ్రామంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు డేగల పాండు యాదవ్ ఎంపిటిసి తుమ్మల వెంకటరెడ్డి నాయకులు కెసిరెడ్డి జనార్ధన్ రెడ్డి,కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, మద్దెల సందీప్,నల్లబోలు నర్సింహా, మర్రి వెంకటేశం, ఏనుగుల కిష్టయ్య, బందారపు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సేకరించిన సాక్షాధారాలతో నిందితులకు శిక్ష

### విశ్రాంత ఎస్పి మల్లారెడ్డి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 9 (ప్రజాపాలన) :** పోలీస్ స్టేషన్లలో కాదు చేసిన కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను సేకరించి నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని విశ్రాంత ఎస్పి మల్లారెడ్డి సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎం నారాయణ సమక్షంలో పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమైన కేసులలో ఏ విధంగా పరిశోధన చేయాలనే విలువైన సూచనలను అందజేయడం జరిగిందని అన్నారు. నేరం చేసిన నిందితులకు శిక్ష పడటం ద్వారా పోలీస్ శాఖ పై న్యాయ వ్యవస్థపై నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ అవగాహన సమావేశం లో జిల్లా అదనపు ఎస్పీ ఎంఏ రషీద్, పరిగి డిఎస్పీ శ్రీనివాసులు, తాండూర్ డిఎస్పి లక్ష్మీనారాయణ, వికారాబాద్ డిఎస్పి సంజీవరావు, జిల్లా ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని పరిశీలించిన తహశీల్దార్



**వలిగొండ, ప్రజాపాలన :** మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 29 లో పక్కనే ఉన్న పట్టాదారులకు ప్రభుత్వ భూమి మధ్యన ఉన్న వివాదాలను పరిష్కరించడానికి స్థానిక తహశీల్దార్ నాగలక్ష్మి బుధవారం సందర్శించారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ గతంలో 29 సర్వే నంబరులో కొంత మంది పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చారని, వాటిని కొంతమంది అక్రమించుకొన్నారని, ఈ వివాదాన్ని పరిష్కరించడానికి సర్వే చేయడానికి ఏడి కి నివేదిక అందజేసి సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని తహశీల్దార్ తెలిపారు. ఆమె వెంట ఆర్ ఐ కరుణాకర్ రెడ్డి,సర్వేయర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



**వలిగొండ ప్రజాపాలన :** ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ 74వ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి నూతి రమేష్ రాజు కేక్ కత్తిరించి అనంతరం ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీ నిర్ణయంతోనే తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల కళ నెరవేరిందని,సమాచార హక్కు చట్టం తీసుకొచ్చిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ అని,ఉపాధి హామీ పథకం తీసుకువచ్చిన ఘనత సోనియాగాంధీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొల్ల లలితా శ్రీనివాస్,కాంగ్రెస్ మండల,పట్టణ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి,కంకల కిష్టయ్య నాయకులు పబ్బు సురేందర్,కాసుల వెంకన్న,బత్తిని సహదేవ,బత్తిని రవి,పాలకూర్ల వెంకటేశం,పంజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

### గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 9 (ప్రజాపాలన) :** ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వార్త విలేఖరి సంతోష్ నాయక్ పై బూతు పురాణం లంఘించిన పటాన్ చెరువు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యసమాజం సిగ్గుపడేలా పదజాలంతో చట్ట సభ ప్రజాప్రతినిధి దూషించడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. తక్షణమే మహిపాల్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న జర్నలిస్టులపై టిఆర్ఎస్ ఎమ్మెల్యే బెదిరింపులకు దిగడం వారి పదవికే మచ్చతెచ్చారన్నారు. మీడియా మిత్రులు లేకపోతే సమాజమే లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి రౌడీయిజంతో ఓ పత్రికా మిత్రున్ని బెదిరించడం తెలంగాణకే అవమానకరమని చెప్పారు. గూండా ఎమ్మెల్యేలు చట్ట సభలకు ఎన్నికవ్వడమే పెద్ద శాపమని ఆందోళన వ్యక్తం చేచేశారు. ఇలాంటి ఎమ్మెల్యే టిఆర్ఎస్ పార్టీలో కొనసాగడం సిగ్గుచేటని అన్నారు. ఈ ఎమ్మెల్యేను టిఆర్ఎస్ ప్రభుత్వం పార్టీ నుండి సస్పెండ్ చేసి చర్య తీసుకోకపోతే భారీ ఎత్తున ఉద్యమం చేపడతామని గిరిజన విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలి, ధర్నా



మందమర్రి డిసెంబర్ 9 ప్రజా పాలన : కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం మందమర్రి మండలంలో బైక్ ర్యాలీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంఓ నిర్వహించి మేడారం జాతీయ రహదారి పై ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష్యుడు కాదారి జీవన్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన రైతన్నల నల్ల బిల్లు వలన రైతులు తీవ్రంగా నష్టపోతారని, రైతులు పండించిన ధాన్యాన్ని దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాల్సినది పోయి ఈ బిల్లు వల్ల రైతులు పండించిన ధాన్యాన్ని ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ ఇచ్చామని చెప్పకుంటున్నాయి. దేశంలో 70 నుండి 80 శాతం మంది రైతులు కేవలం రెండు నుండి నాలుగు ఎకరాల మధ్యలో ఉన్నవారు చిన్న సన్నకారు రైతులు మాత్రమేనని వారు పండించిన ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తీసుకు వెళ్ళే స్తోమత ఆర్థిక పరిస్థితి కూడా రైతులకు ఉండదని, ఈ బిల్లువల్ల అదొని అంబానీ లాంటి కార్పోరేట్ వ్యవస్థలకు అనుకూలం గా చేసారే తప్ప రైతుల మీద ప్రేమ కోసం కాదని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. దేశానికి వెన్నెముక లాంటి రైతును నడ్డివిరిచే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని ఇలాంటి పరిస్థితి కొనసాగితే రానున్న రోజేల్లో క్రాప్ హాలీడేలు ప్రకటించే రోజులు వస్తాయని హెచ్చరించారు. సన్నరకాలు వడ్లు వేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రే చెప్పి చీడపీడల వలన రైతు దిగుబడి సగానికి పడిపోవడం జరిగిందని, వడ్లకు మద్దతు దర రూ॥2వేల 5వందలు ప్రకటించాలని డిమాండ్ చేసారు. లక్ష రూపాయల ఋణమాఫీని వెంటనే అమలు చేయాలని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాయన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నూకల రమేష్, మందమర్రి మున్సిపల్ ఇన్చార్చి నోముల ఉపేందర్ గౌడ్, టిపిసిసి సెక్రటరీ రఘునాదరెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ ముజాయిద్, పట్టణ అధికార ప్రతినిది వర్ణ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## గోజిగూడ కార్యకర్తలతో కాలనీ వాసులు అందరూ సమిష్టిగా పని చేశారు



బాలాపూర్ : ప్రజాపాలన న్యూస్ : బాలాపూర్ మండలం బిజెపి సీనియర్ నాయకుడు బాలాపూర్ నివాసి అయినటువంటి మాజీ సింగిల్విండో జై కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కోలన్ శంకర్ రెడ్డి నీ మర్యాదపూర్వకంగా సొంత నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు మిఠాయిలు పంచారు. బిజెపి లింగోజిగూడ కార్పొరేటర్ కార్యకర్తలు మాట్లాడుతూ...... గతంలో జిహెచ్ఎంసి ఎలక్షన్స్ సందర్భంగా లింగొజిగూడ డివిజన్ ఇంచార్జీగా వచ్చి లింగొజిగూడ గడ్డ పైన బీజేపీ జెండా ఎగుర వేయడానికి తన వంతు సహాయ, సహకారాలు అందించి గెలుపు కోసం అందరూ సమిష్టిగా పనిచేసిన ఆకుల రమేష్ గెలిపించినందుకు గాను కొలాన్ శంకర్ రెడ్డి గారికి సన్మానం చేయడం జరిగింది. కోలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ...... బిజెపి హై కమాండర్ ఆదేశానుసారం గా నాకు ఇచ్చిన బాధ్యతను లింగోజిగూడ ఇన్చార్జి సక్రమంగా పాటించి లింగోజిగూడ గడ్డపై బీజేపి అభ్యర్థి గెలిచినందుకు సంతోషం తో పాటు అక్కడున్న కాలనీవాసులు సమిష్టగా పని చేసినారు అని అన్నారు. ఆ డివిజన్ లో ఉన్న కాలనీవాసులు అందరికీ ధన్యవాదాలు, ప్రజలలో మార్పు మొదలైందని ప్రజల్లోకి బిజెపి దీటుగా ఉందని చెప్పినారు. ఈ కార్యక్రమంలో ఆకుల రమేష్ గౌడ్, పుట్టల జగదీష్ కుమార్, డివిజన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూలూరుపాడు మండలంలో సోనియా జన్మదిన వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు : మండలం లో సోనియాగాంధీ 72వ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రధాన సెంటర్లో గల రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద వైరా కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు మా లోతు మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో కేకును కత్తిరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ అని ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నామని తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అప్పుడు సోనియాగాంధీ ఆశలు నెరవేరతాయి అన్నారు అనంతరం స్థానిక పీహెచ్సీలో రోగులకు పండ్లు పంచారు ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ తో పాటు నాయకులు లచ్చు నాయక నున్న కృష్ణయ్య బొడ్డు కృష్ణయ్య చిలుకూరు కృష్ణయ్య లు పాల్గొన్నారు.

## నిరుపేదలకు పండ్లు పలహారాలు పంపిణీ



బాలాపూర్ : ప్రజాపాలన న్యూస్ : సోనియాగాంధీ 74వ జన్మదిన వేడుకలులి మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తా లో పన్నాల సురేష్, రాజన్నల ఆధ్వర్యంలో సోనియాగాంధీ 74వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అతిధి గా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామిడి గోపాల్ రెడ్డి హాజరై సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి నిరుపేదలకు పండ్లు పలహారాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి పేదలను ఆదుకున్న పార్టీ దేశానికి త్యాగం చేసిన త్యాగమూర్తుల పార్టీ అని కొనియాడారు. మీర్పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినేత వల్లనే తెలంగాణ వచ్చిందని ప్రతి ఒక్కరికి తెలుసు కాంగ్రెస్ పార్టీ నాయకులను సంతలోనీ ఏదుల మాదిరిగా కొనేస్తున్నారు. మా నాయకులు కాంగ్రెస్ పార్టీలో గెలిసి దుర్బుద్ధితో మిగతా పార్టీలో కలుస్తున్నారు. కానీ ఎప్పటికైనా మా పార్టీలోకి నేతలు రావటానికి బలోపేతానికి సమయం వస్తుందని అన్నారు. సోనియాగాంధీ దేశానికి త్యాగం చేసిన ఘనత సోనియమ్మది. (రాజీవ్గాంధీ చని పోయిన) భర్తను మాంసపు ముద్ద తో అందిస్తే బాధ దిగమింగు కుంది. కుటుంబాన్ని ఈ దేశం కోసం పోగొట్టుకుంది ఇక్కడ రాజకీ యాలను శాసించింది. ఈ భారత దేశం కోసం పసుపు కుంకుమలు అర్పించింది. ఈ రాష్ట్రం కోసం ఎంతోమంది కన్న తల్లి కడుపు కోతలను ఆపింది. 125 సంవత్సరాల పార్టీ భవిష్యత్తును ఒక తెలంగాణ కోసమే తాకట్టు పెట్టింది సోనియమ్మ. సందు దొరికితే సంతలో ఎద్దులు కొన్నట్టు కొనుక్కుని ప్రతిపక్ష పార్టీలు కలుపుకుంటున్నారు, ఈ రోజుల్లో అత్యున్నత ప్రధాని పదవినీ త్యజించిందినీ అన్నారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామిడి గోపాల్ రెడ్డి, బండి రాళ్ల రాజనా, కంచర్ల అమరేందర్ రెడ్డి, పన్నాల సురేష్, మల్లారెడ్డి మహేశ్వర్ రెడ్డి, జి శంకర్, వీరన్న, సింధు చారి, ఎస్ ఎస్. అంజి, సంతోష్, బాలకృష్ణ, మహి ళా మణులు కాంగ్రెస్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం, ప్రజాపాలన : మండల కేంద్రంలో సోనియాగాంధీ 74వ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రధాన సెంటర్లో గల సోనియాగాంధీ జన్మదిన వేడుక సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాణావత్. భీముడు ఆధ్వర్యంలో కేకును కత్తిరించి స్వీట్లు, మిఠాయిలు పంచిపెట్టారు.జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణను రాష్ట్రంగా ఏర్పాటు చేసి, దశబ్దాల తెలంగాణ కళను సాకారం చేసిన అమృతమూర్తి అని తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ అని ఆమె నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నామని తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అప్పుడు సోనియాగాంధీ ఆశలు నెరవేరతాయి అన్నారు అనంతరం ఈ సందర్భంగా అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని పేద ప్రజలకు వృద్ధులకు, రోగులకు కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముద్రగడ వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా పుల్లయ్య,పెంకే.మల్లయ్య, గొళ్ళ.ముత్తయ్య ,పెంట్లం ఉపసర్పంచ్ రాంచందర్, యాకూబ్ పాషా , సుభాని ,కొండేటి నరసింహారావు, బొల్లేపల్లి. వెంకన్న, మైనార్టీ సెల్ అధ్యక్షులు అహ్మద్ ,వెంకట్రామయ్య ,కాంగ్రెస్ కార్యకర్తలు,అభిమానులు హాజరయ్యారు.

## మాదిగల 'అలయ్-అలయ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు : మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్ర తొలి యస్.సి.కార్పొరేషన్ ఛైర్మన్ డా.పిడమర్తి. రవి గారు ఈ నెల 20వ తారికున మాదిగల ఐ.కా.స.ఆధ్వర్యంలో హైదరాబాద్ లో జరుగు "అలయ్-బలయ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోడ పత్రికలు విడుదల చేసినారు.యస్.సి. వర్గీకరణ కు చట్ట బద్ధతకు కేంద్రం పై ఒత్తిడి తేవాలని, తెలంగాణ లోని మాదిగలకు 12%, యస్.టి. లకు 10%,బి.సి.లకు 50%, మైనార్టీలకు 12% రిజర్వేషన్ల సాధనకై కేంద్రం పై పోరాడాలని కొరినారు. అలయ్-బలయ్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు, యువకులు,మహిళలు, ఉద్యోగులు,మేధావులు పాలుగోని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు. జోగరావు, ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు చిప్పలపల్లి.వెంకన్న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు దేపంగి.వెంకటరమణ, జిల్లా యువజన నాయకులు కంకణాల. ఉజీవ్ రావు, దేవరకొండ.నరేష్ తదితరులు పాలుగొన్నారు.

## సామందల లికిత్ కుటుంబానికి సిపిఐ అండ



భద్రాద్రికొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 9 ప్రజాపాలన : పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన సిపిఐ వైరా నియోజకవర్గ నాయకులు బానోతు విజయ బాయ్, రోడ్డు ప్రమాదం లో మరణించిన ఏఐవైఎఫ్ నాయకులు లికిత్ స్మారక స్థూపాన్ని బుధవారం సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా. ఆవిష్కరించారు పార్టీ పతాకాన్ని సిపిఐ వైరా నియోజకవర్గ నాయకులు భానోత్ విజయ భాయి ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభ లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ చిన్న వయసులోనే పార్టీ సిద్ధాంతాల కోసం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారని వారి మరణం సిపిఐకి తీరనిలోటని వారి ఆశయాల సాధన కోసం కృషి చేయాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు ఎల్లంకి మధు దేవినేని జనార్ధన్ చింత స్వరాజ్ రావు బెజవాడ సీతయ్య గుడిమెట్ల సీతయ్య కలోజి రవికాంత్ డీజే నాగరాజ్ కాశీ మల్ల ఏసుబాబు వేమూరి గోపయ్య. కలో జి భాస్కర్ కలో జి రామస్వామి సామేలు కొండ వీరయ్య పవన్ సంతోష్ పకీరు. ఏ ఐ వై ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్ మీరా పాపకొల్లు మాజీ ఉపసర్పంచ్ గార్లపాటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు

## రోగులకు బ్రెడ్ ప్యాకెట్లు పండ్లు పంపిణీ



భద్రాద్రికొత్తగూడెం ప్రజా పాలన న్యూస్ : సుజాతనగర్ మండల పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీన అధినేత్రి సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగాసీతారాములు సలహా వారి సూచనలతో డాక్టర్ బి నాగమణి చేతుల మీదుగా రోగులకు బ్రెడ్ ప్యాకెట్లు,పండ్లు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి పేదవారికి వైద్యం అందాలని కాంగ్రెస్ పార్టీ ఆరోగ్యశ్రీని తీసుకు వచ్చిందని అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగార్జున, జయరాజు, వీరాపురం రామలక్ష్మణ్ రావు,యాలాద్రి,జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అబీద్,పూరేటి నరేష్, గుడుమాస్ సురేష్ గుప్తా,తెల్లబోయన వెంకటేష్, శ్రీను,గోపి,టి.కవీన్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కేషవభవన్‌లో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



మధిర, ప్రజా పాలన న్యూస్ : సోనియాగాంధీ గారి 72వ జన్మదినాన్ని పురస్కరించుకొని మధిర మండల కాంగ్రెస్ పార్టీ (కేషవభవన్)లో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంసెట్టి కిషోర్ ఆధ్వర్యంలో కేకును కత్తిరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ అని. ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలి అని కోరుకుంటు, తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చి సోనియాగాంధీ ఆశలు నెరవేరుస్తాం అన్నారు . ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, సర్పంచ్ చిట్టిబాబు,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు,యూత్ కాంగ్రెస్ నాయకులు అద్దంకి రవి,నవీన్ రెడ్డి, ఐఎన్టీయూసీ నాయకులు కోరంపల్లి చంటి,బాజి,మైనార్టీ నాయకులు షేక్ జహంగీర్,చింతమాల శ్రీనివాస్ రావు,ఆవుల కిరణ్,మాజీ సర్పంచ్ బొమ్మకంటి హరిబాబు,కర్నాటి రామారావు,ఆదిములం శ్రీనివాసరావు,మైలవరపు చక్రి,బిట్ర ఉద్దండయ్యా, మోదుగు బాబు,జమిల్ పాషా మొదలగువారు పాల్గొన్నారు...

## అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో రైతుల మహాధర్నా



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మం డలం ప్రజా పాలన : చర్ల మండల కేంద్రంలో ఎంపీపీ కోదండ రామయ్య ఇంటి ఆవరణలో బుధవారం అఖిల పక్ష నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చర్ల మండలంలోని గోదావరి తీర ప్రాం తం లో నిర్మించే సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ కోసం చేసిన సర్వేలో భూ ములు కోల్పోయిన రైతులకు న్యా యం జరగాలని 11వ తేదీన శుక్రవారం ధర్నా చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ నిర్మానం చేపట్టేందుకు చేసిన సర్వేలో పంట పొలాలు, పోడు భూములు కోల్పోయిన రైతుల నుండి అధికారులు వారికి ఎటువంటి భరోసా ఇవ్వకుండ పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు వంటి పత్రాలు సేకరిస్తుండటంతో రైతులకు తీవ్ర నష్టం జరు గుతుందనీ, భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు 30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండు చేసారు. ఈ కార్యక్రమానికి మం డలంలోని రైతులందరు పాల్గొనాలని పిలుపినిచ్చారు. ఎంపీపీ కోదండ రామయ్య, జెడ్పీటీసీ ఇర్పా శాంత, ఎంపీటీసీ మడకం పద్మ, కాంగ్రెస్ భద్రాచల డివిజన్ ఇంచార్జి నల్లపు దుర్గా ప్రసాద్, కాంగ్రెసు మండల అధ్య క్షులు ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, సీపీఎం డివిజన్ నాయకులు చీమల మర్రి మురళి, సీపీఐ నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, అడ్డగర్ల తాతాజి,భారతీయ జనతాపార్టీ జిల్లా నాయకులు బిట్రగుంట క్రాంతి కుమార్,పాసిగంటి సంతోష్, మండల కన్వీనర్ పుగాకు పూర్ణ చందు, రైతులు గుంటుపల్లి నరసింహ చారి పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన తుమ్మల నాగేశ్వరరావు



పాలేరు నేలకొండపల్లి డిసెంబర్ 3 ప్రజాపాలన : ఖమ్మం జిల్లానేలకొండపల్లి మండలం లో సుద్దేపల్లి గ్రామం లో కడియాల శ్రీను అన్నయ్య ఇంట్లో జరుగు వివాహ వేడుక లో పాల్గొని వధూ-వరులను ఆశీర్వదించిన గౌరవ మాజీ మంత్రి ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రదాత తుమ్మల నాగేశ్వరావు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి నేలకొండపల్లి మాజీ ఏఎంసీ చైర్మన్ శాఖమూరి రమేష్ టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు వెన్నపూసల సీతారాములు ఎడవల్లి సైదులు గంజికుంట్ల వెంకన్న కొడాలి గోవిందరావు చింత నిప్పు సైదులు నర్రా పూర్ణ గుడిమల్ల మోహన్ రావు తుమ్మ ఉపేందర్ మందపల్లి రంగారావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## వృద్ధాప్యంలో కండలు ఇక కరగవు



వయసు పైబడినకొద్దీ కండలు కరిగిపోతుంటాయి. వృద్ధాప్యంలో కాళ్లు, చేతుల్లోని కండరాలు కరిగిపోయి బక్కచిక్కినట్లు కనిపిస్తుంటారు. అయితే అలా ఎందుకు అవుతుందో మాత్రం ఇప్పటివరకు ఎవరూ చెప్పలేకపోయారు. దీనిపై పరిశోధన జరిపిన యూకేలోని మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు.. వయసుపైబడే కొద్దీ కాళ్లలోని కండరాలను నియంత్రించే 30 నుంచి 50శాతం నాడులు బలహీనపడిపోతాయని గుర్తించారు. దీంతో మెదడు, కండరాల మధ్య సంబంధం తెగిపోవడం వల్ల కండలు కరిగిపోతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే ఈ నాడులు బలహీనపడటాన్ని తగ్గిస్తే కండరాలు కరగకుండా జాగ్రత్త పడొచ్చని పేర్కొన్నారు.

## వృద్ధ విలాపం!



'వృద్ధులను గౌరవించాలి'... బస్సుల్లోనో, బడి గోడలపైనో కనిపించే నీతి వాఖ్యమిది. దీనిని ఎవరూ ఆచరణలో చూపడం లేదు. దేశంలో ప్రతి ఇద్దరు వృద్ధుల్లో ఒకరు ఒంటరితనంలో బాధపడుతున్నారు. కనీసం ప్రేమగా మాట కలిపేవారు కూడా లేక కుంగుబాటుకు గురవుతున్నారు. తల్లిదండ్రులను వదిలేసి పిల్లలు తమ దారి తాము చూసుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ పరిస్థితి పట్టణాల్లో మరీ ఎక్కువ గా ఉంది. 10 కోట్ల మందికి పైగా ఉన్న వృద్ధులున్న మన దేశంలో అనేక మంది మానసిక సమస్యలతో బాధపడడానికి ఒంటరితనమూ కారణమవుతోంది. 'భారత్‌లో మారుతున్న వృద్ధుల అవసరాలు, హక్కులు' అనే పేరుతో ఏజ్‌వెల్ అనే సంస్థ సర్వే నిర్వహించి ఈ వివరాలను వెల్లడించింది. 25 రాష్ట్రాల్లో 15 వేల మంది వృద్ధులతో ఈ సంస్థ మాట్లాడింది. ఇందులో 47.49 శాతం ఒంటరితనంతో గుబులుగా బతుకీడుస్తున్నారు. పట్టణాల్లో 5 వేల మంది సర్వేలో పాల్గొనగా వారిలో 3,205 మంది(64.1 శాతం) ఒంటరి జీవులే. ఇక పల్లెల్లో 10 వేల మంది సర్వేలో పాల్గొనగా వారిలో 39.19 శాతం కనీసం మాట పలకరింపునకూ నోచుకోవడం లేదు.

కారణాలివి..

సర్వేలో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది తమ జీవిత భాగస్వామిని కోల్పోయిన వృద్ధులు, లేదా పిల్లలతో సంబంధం లేకుండా కేవలం భార్యతో కలిసి విడిగా జీవిస్తున్న వారున్నారు. ఇది వారిలో ఒంటరి తనం భావనను పెంచుతోంది. ఇలా జీవిస్తున్న వారు 36.78 శాతం ఉన్నారు.

కుటుంబంతో కలిసి ఉంటున్న వారి విషయంలోనూ 27.3 శాతం వృద్ధులు.. కుటుంబ సభ్యులెవరూ పెద్దగా పట్టించుకోక పోవడంతో నలుగురిలో ఉండి ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు.

19.06% అనారోగ్యం కారణంగా, 12 % సామాజికంగా సంబంధాల్లేక ఏకాకులవుతున్నారు.

ప్రతి ఐదుగురిలో ఒకరికి ఒంటరితనం వల్ల మానసికసమస్యలతో కౌన్సెలింగ్ తప్పనిసరి అవుతోంది.

# శతమానం భవతి

ముప్పై ఏళ్లకి ఆయాసం, నలభై ఏళ్లకి నీరసం.. ఇటీవల చాలామందిలో చూస్తున్న పరిస్థితి ఇది. ఇక యాభయ్యో పడిలో పడితే గుప్పెడు మాత్రలు మింగుతూ ఇంటిపట్టున కృష్ణారామా అనుకుంటూ కూర్చోవలసిందే! మన దగ్గర ఇలా ఉంటే జపాన్ దగ్గరున్న 'ఒకినావా' దీవి వాసులు మాత్రం శతాధికవృద్ధులుగా ప్రపంచ ప్రఖ్యాతి పొందుతున్నారు. అక్కడి 'జిరోమాన్ కిమురా' అనే ఓ శతాధిక వృద్ధుడు ఏకంగా 116 ఏళ్లదాకా బతికి ఇటీవల కొత్త రికార్డు సృష్టించాడు. ఇతనికి ముందు మిసావో ఒకావా అనే మహిళ 115 ఏళ్లు జీవించిన శతాధికురాలిగా పేరు తెచ్చుకుంది. జపనీయులు వందేళ్లు జీవిస్తూ పేరు తెచ్చుకుంటే, ఒకినావా వాసులు ఏకంగా సెంచరీ కూడా దాటేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నారు. అయితే వీళ్లింత సుదీర్ఘకాలం జీవించటం వెనకో ఆరోగ్య రహస్యం ఉంది. అదే...'ఒకినావా డైట్'.

ఒకినావా అనేది జపాన్‌లోని ఓ దీవి. ఈ దీవిలోని వాళ్లంతా నిండు నూరేళ్లపాటు జీవించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. మరి దీర్ఘాయుష్షు కోసం వీళ్లంతా ఏం తిన్నారు? ఆ వివరాలు తెలియాలంటే ఒకినావా ఆహారశైలి గురించి తెలుసుకోవాలి.

ఒకినావా 'చిలకడ దుంప'

ఒకినావా ద్వీపంలో ఇప్పుడు కనిపించే శతాధిక వృద్ధులందరూ 1903 – 1914 మధ్యకాలంలో పుట్టినవాళ్లే! వీళ్ల జీవితంలో మొదటి పావు భాగం వరకు... అంటే 1940 వరకూ ఎక్కువ శాతం, దాదాపు 60 శాతం క్యాలరీలను ఒకే ఒక పదార్థం నుంచే తీసుకున్నారు. అదే 'ఐమో'. ఐమో అనేది ఒకినావా ద్వీపంలోని చిలకడ దుంప. వంకాయ లేదా పసుపుపచ్చ రంగులో ఉండే ఈ స్వీట్ పొటాటో 400 ఏళ్లకు పూర్వం అమెరికా నుంచి ఈ దీవికి తరలి వచ్చింది. దీన్లో అత్యధిక ఫ్లావనాయిడ్స్, విటమిన్ సి, కెరోటినాయిడ్స్, ఆలస్యంగా ఖర్చుయ్యే పిండి పదార్థాలున్నాయి.

తక్కువ క్యాలరీలు: ఒకినావా వాసులు జపనీయుల కంటే 20 శాతం తక్కువ క్యాలరీలున్న ఆహారం తింటారు. ఒక గ్రాము ఆహారానికి ఒక గ్రాము క్యాలరీ ఉండేలా చూసుకుంటారు. వాళ్ల బిఎమ్ఐ (బాడీ మాస్ ఇండెక్స్) సుమారుగా 20. దీన్నిబట్టి క్యాలరీలను కంట్రోల్ చేస్తే బరువు అదుపులో ఉండటంతోపాటు ఈ కింది ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆరోగ్యం మెరుగవుతుంది... వృద్ధాప్యం ఆలస్యమవుతుంది.



ఒకినావాలు పళ్లు, కూరగాయలను గ్రీన్, ఆరెంజ్, ఎల్లో (జిఓవై)...ఈ మూడు రంగుల్లో వర్గీకరించుకుటారు. ఈ రంగుల్లో ఉండే పళ్లు, కూరగాయలు, దుంపలను మాత్రమే తింటారు. జిఓవై ఫుడ్‌లో విటమిన్ ఎ, విటమిన్ సి, బీటా కెరోటిన్, లుటీన్, గ్జాంథీన్ వంటి పోషకాలుంటాయి.

తక్కువ చక్కెర, కొవ్వులు: ఆరోగ్యాన్ని శుష్కింపజేసేవి చక్కెర, కొవ్వులే! కాబట్టి 'ఒకినావా డైట్'లో వీటికి స్వల్ప స్థానం ఉంటుంది. వీళ్ల దైనందిన ఆహారంలో 25 శాతం చక్కెర, కొవ్వులు ఉంటాయి. మిగతా 75 శాతం పప్పుధాన్యాలతో నిండి ఉంటుంది. కాబట్టే వీళ్లకు హృద్రోగాలు, గుండెపోట్లు రావు.

కూరగాయలు, సముద్రాహారం: ఎక్కువమంది ఒకినావాలు శాకాహారులే! వాళ్లుండే ప్రదేశం దీవి కాబట్టి వీళ్లలో కొందరు సముద్రాహారం కూడా తింటారు. అయితే తక్కువ మొత్తంలో చేపలు, ఎక్కువగా కూరగాయలు తింటారు. ఇక మాంసం, డైరీ ఉత్పత్తులు, గుడ్లకు సాధ్యమైనంత దూరంగా ఉంటారు. ఒకినావా డైట్ ఎంతో క్రమశిక్షణతో కూడుకున్నది. ఆరోగ్యానికి మేలు చేస్తూ ఆయుష్షుని కాపాడే పదార్థాలను ఆచితూచి ఎంచుకోబట్టే అక్కడివాళ్లకు అంత దీర్ఘాయుష్షు.

## ఒంటరితనం ఒడిలో...



ఇటీవల కాలంలో చాలామంది సీనియర్ సిటిజన్స్ తీవ్రమైన డిప్రషన్‌కు లోనవుతున్నారు. ముఖ్యంగా విదేశాల్లో ఉన్న పిల్లలు తల్లిదండ్రుల సంరక్షణా బాధ్యతను బంధువులు లేదా పనివాళ్ల చేతుల్లో పెట్టేస్తున్నారు. సీనియర్ సిటిజన్లలో పెరుగుతున్న డిప్రషన్‌కు ఇది ప్రధాన కారణమని మానసిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పిల్లలు దగ్గర లేక పనివాళ్ల దయాదాక్షిణ్యాల మీద సీనియర్ సిటిజన్లు ఆధారపడవలసి వస్తోంది. ఫలితంగా తీవ్రమైన ఒంటరితనాన్ని వీళ్లు ఫీలవుతున్నారు. కొందరు వృద్ధులైతే ఆ ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. చండీఘడ్‌లో ఈ పరిస్థితులు బాగా కనిపిస్తున్నాయని మానిసిక నిపుణులు పేర్కొన్నారు. 'తల్లిదండ్రులు ఈ వయసులో పిల్లల నుంచి ప్రేమ, వాత్సల్యాలు, అండదండలు కోరుకుంటార'ని నిపుణులు చెప్తున్నారు. చండీఘడ్‌లో ఇలాంటి సీనియర్ సిటిజన్ బాధితుల సంఖ్య రెట్టింపు అయిందని గణాంకాలు చెప్తున్నాయి. చండిఘడ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు చెందిన సైకియాట్రిస్టు నిపుణులు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల కాలంలో చండీఘడ్‌లో ఒంటరితనంతో బాధపడుతున్న సీనియర్ సిటిజన్ల సంఖ్య రెట్టింపు అయిందని వెల్లడించారు. 2008 ఒపిడిలో నమోదైన సీనియర్ సిటిజన్ కేసులు 580 ఉండగా, 2016 నాటికి వీరి సంఖ్య రెట్టింపు అంటే 1,488 అయిందని చెప్పారు. 'గతంలో పిల్లలతో ఆసుపత్రికి వచ్చే సీనియర్ సిటిజన్లు ఇప్పుడు సర్వెంట్లతో వస్తున్నారు. మానసిక సమస్యలతోపాటు ఆరోగ్య సమస్యలు కూడా వీరిని బాధిస్తుంటాయి. దీంతో ఒంటరిగానే వైద్యుల వద్దకు వీళ్లు వెళ్లాల్సివస్తోంది' అని మానసిక వైద్యులు ఒకరు తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్లు ఎక్కువగా డెమన్షియా అనే మానసిక సమస్యతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే సీనియర్ సిటిజన్లకు నిత్యం ఫిజికల్ యాక్టివిటీ, మెంటల్ యాక్టివిటీ అవసరమని నిపుణులు తేల్చారు. కథలు చెప్పడం, కొత్త సాంకేతిక పరికరాలను వాడడం వంటి పనుల్లో వారి బ్రెయిన్లను బిజీగా ఉంచితే వారు ఒంటరితనాన్ని అధిగమించగలరు. సమాజ సేవలో సైతం పాలుపంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. 'రిటైర్డ్ లైఫ్ గడపకుండా తమ హాబీలను కొనసాగిస్తూ నిత్యోత్సాహంగా ఉండాలి. ఇలా చేయడం వల్ల వాళ్లు నిరంతరం యంగ్‌గా ఉంటారు. అప్పుడు తమది ఓల్డ్ ఏజ్ కాదు... 'గోల్డ్ ఏజ్' అని వాళ్లు అనుకుంటారు' అని మానసిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ఆ వయసులో ఆసరా

వయసు మీరిన పెద్ద వాళ్లు ఇంట్లో ఉంటే వాళ్లని సౌకర్యంగా ఉంచాలి. సురక్షితంగా చూసుకోవాలి. అందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే... వాళు అన్ని రకాలుగా సేఫ్‌జోన్‌లో ఉన్నట్టు భావిస్తారు.

బరువు తక్కువ ఉన్న చిన్న జగ్ నిండా నీళ్లు నింపి అందుబాటులో ఉంచాలి. నీళ్లు తరచుగా తాగుతుండమని చెప్పాలి వాళ్లకు. శరీరానికి సరిపడా నీటిని అందించడం వల్ల తలనొప్పులు, నిద్రలేమి, ఆకలి మందగించడం వంటి ఇబ్బందులు ఎదురు కావు. ఒక్క ముక్కలో చెప్పాలంటే మంచి నీళ్లు సరిపడా తాగితే బోలెడు అనారోగ్యాల్ని దరిచేరనీయకుండా జాగ్రత్తపడొచ్చు.

ఇంట్లో ఎక్కడపడితే అక్కడ అద్దాలు ఉంచొద్దు. ఆ అద్దాలు చూసి పెద్దవాళు తికమక పడే అవకాశం ఉంది. కొన్నిసార్లు వాళ్ల ప్రతిబింబాన్ని వాళ్లే గుర్తించలేని స్థితిలో ఉంటారు. అద్దం ముందు నడిచినప్పుడు కూడా గందరగోళ పడతారు. ఒకవేళ అద్దాలు పెట్టడం తప్పదంటే చిన్న అద్దాల్ని గోడల మీద కాస్త ఎత్తులో అమర్చాలి.

ఫోన్, రిమోట్ డయల్, నెంబర్ ప్యాడ్‌ల మీద అంకెలు, అక్షరాలు పెద్ద సైజులో ఉండాలి. ఇంట్లో డిజిటల్ క్లాక్స్ ఉంచాలి. సంప్రదాయ గడియారాల్లో కంటే డిజిటల్ క్లాక్స్‌లో చదవడం సులభంగా ఉంటుంది.

ఇక వాళ్లు వేసుకునే దుస్తుల రంగుల విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. నలుపు, లేత గోధుమరంగు, తెలుపు, క్రీం, ఆకుపచ్చ రంగులవి దస్తులు అయితే వాళ్ల బట్టల్ని వాళ్లు సులభంగా తీసుకోగలుగుతారు. వార్డ్‌రోబ్‌లో షర్ట్స్ అన్నీ ఒక పక్కకి, ప్యాంట్లు, షార్ట్స్, లుంగీలు మరో పక్కకి సర్దాలి. అలాగే చీరలు, స్కర్ట్స్ వంటివి ఒక పక్కన, బ్లౌజ్‌లు, కుర్తా టాప్స్ మరో పక్కన సర్దాలి. వాడని బట్టలు వార్డ్ రోబ్ నుంచి తీసేయాలి.

ఈ జాగ్రత్తలన్నింటితో పాటు ఇంట్లో మీరు తీసుకునే నిర్ణయాల్లో వాళ్లని కూడా భాగస్వాములు చేయాలి. ఇలా చేయడం వల్ల వయసు మీద పడటంతో తమకి ప్రాధాన్యత తగ్గింది అనే భావన వాళ్లలో తలెత్తదు. మరో ముఖ్యమైన విషయం వాళ్ల ముందు ఎక్కువ చాయిసలు ఉంచితే ఎంపిక చేసుకోవడంలో గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఎదురుకాకుండా ఉండాలంటే వాళ్లకి నచ్చే వాటినుండి కొన్ని చాయిసలు ముందుపెట్టాలి. వాటి నుంచి ఎంపిక చేసుకోమని చెప్పాలి.

## మలివయస్సుకి పీచు రక్షణ!

యాభై సంవత్సరాలకి ముందు ఎలాంటి ఆహారం తీసుకున్నా, యాభై దాటిన తరువాత మాత్రం తాము తీసుకునే ఆహారంలో కచ్చితంగా పీచు ఉండే విధంగా చూసుకోవాలి అంటున్నారు ఆస్ట్రేలియా యూనివర్శిటీ పరిశోధకులు. యాభై నుంచి డెబ్భై సంవత్సరాల మధ్య వయస్సుగల సుమారు 1500 మంది మీద వీరు సుదీర్ఘ కాలం పాటు అధ్యయనం నిర్వహించారు. వీరిలో కొందరికి మామూలు ఆహారం అందించారు. మిగతా వారికి పీచు అధికంగా కలిగిన ఆహారాన్ని అందించారు. కొన్ని రోజుల అనంతరం వీరిని పరిశీలించగా, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకున్న వారిలో ఎక్కువమంది మునుపటి కన్నా మరింత ఆరోగ్యంగా ఉండగా, పీచు తీసుకోని వారిలో రకరకాల ఆరోగ్య సమస్యలు వీరి దృష్టికి వచ్చాయి. అవన్నీ సాధారణంగా వయస్సురీత్యా వచ్చే సమస్యలే అయినా, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వలన వాటి బారి నుంచి చాలా వరకూ తప్పించుకోవచ్చు అని పరిశోధనాకారులు అంటున్నారు.

# కాళ్ల మీద కన్నేయండి!

కొన్ని ఆరోగ్య సమస్యలు చాప కింద నీరులా శరీరాన్ని కుదేలు చేస్తాయి. అలాంటివాటిలో 'వెరికోజ్ వెయిన్స్' ఒకటి. అయినా 'ఆ సమస్య మనకెందుకొస్తుందిలే! మనమేం వృద్ధులం కాదు, కాయకష్టం చేసుకునేవాళ్లం కాదు' అనుకుంటున్నారా? కానీ ఇది 14 నుంచి 90 లోపు వయసున్న ఎవరికైనా, ఎప్పుడైనా రావొచ్చు. పురుషులతో పోలిస్తే స్త్రీలలోనే ఈ సమస్య ఎక్కువ. శ్రమజీవులకే కాదు, ఇంటి పట్టున ఉండేవాళ్లలోనూ ఈ ఇబ్బంది తలెత్తవచ్చు. వెరికోజ్ వెయిన్స్ సర్వసాధారణమైన సమస్య. ప్రపంచవ్యాప్తంగా 20% మంది ఈ సమస్యతో బాధపడుతున్నారంటే ఇది ఎంత సాధారణమైనదో అర్థం చేసుకోవచ్చు. అసలీ సమస్య ఎందుకు తలెత్తుతుంది? దీనికి కారణాలేంటి?

వెరికోజ్ వెయిన్స్ అంటే?

కాళ్లలో రెండు రకాల సిరలుంటాయి. పైకి కనిపించే 'సూపర్‌ఫిషియల్ వెయిన్స్', చర్మం అడుగున 'డీప్ వెయిన్స్' అనే రెండు రకాల సిరల్నవమాట. వీటిలో చర్మం అడుగున ఉండేవి మన కళ్లకు కనిపించవు. ఉబ్బినట్టు కనిపించేవి సూపర్‌ఫిషియల్ వెయిన్స్ మాత్రమే! అయితే ఈ రెండు రకాల సిరలూ కాళ్ల నుంచి రక్తాన్ని గుండెకు చేరవేస్తూ ఉంటాయి. ఆ మార్గంలో కవాటాలు చెడిపోతే రక్తం పూర్తిగా పైకి ఎగబాకలేక కాళ్లలోనే నిలిచిపోతూ ఉంటుంది. సిరల్లో ఉండే వన్ వే వాల్వ్‌లు రక్తం పైకి వెళ్లాక మూసుకోవాలి. కానీ అవి చెడిపోవడం వల్ల రక్తం పైకి వెళ్లకుండా కిందకే వచ్చేస్తుంది. పైకి కనిపిస్తే వాటిని తేలికగానే కనిపెట్టవచ్చు. కానీ కొందరికి డీప్ వెయిన్స్ ఉబ్బుతాయి. వీటిని కనిపెట్టడం కష్టం.

ప్రారంభంలోనే కనిపెట్టాలి!

చర్మం అడుగున ఉండే వెరికోజ్ వెయిన్స్ ఉబ్బితే స్పష్టంగా కనిపిస్తాయి. కానీ పిక్కల లోపలి సిరలు ఉబ్బితే కంటికి ఏమీ కనిపించదు. కాబట్టే ఈ మధ్య కాలంలో ఈ సమస్యను వెరికోజ్ వెయిన్స్‌గా సంబోధించడానికి బదులు 'వీనస్ ఇన్‌కాంపిటెన్స్' అంటున్నారు. వీనస్ ఇన్‌కాంటినెన్స్ అంటే... ఓ సమస్య కారణంగా సిరలు పని చేయడం మానేయడం. అయితే ఏ సిరలు ఉబ్బినా సమస్య తాలూకు లక్షణాలు కొన్ని ఉంటాయి. అవేంటంటే...

కాళ్లు నల్లబారడం

అరగంట లేదా గంటపాటు నిలబడితే కాళ్లలో నొప్పి, కాళ్లు లాగుతూ ఉండడం

కాళ్లు బరువనిపించడం

సాయంకాలమవుతున్నకొద్దీ కాళ్లు లాగేస్తూ ఉండడం, వాయడం, నొక్కించుకోవాలనిపించడం.

పాదాల్లో పుండ్లు

చర్మం రంగు మారి, పొట్టు రాలడం

ఇవీ కారణాలు!

వెరికోజ్ వెయిన్స్ తలెత్తడానికి ఇదీ కారణం అని నిర్దిష్టంగా చెప్పలేం! కానీ వంశపారంపర్యంగా సంక్రమించే గుణం దీనికుంది. అలాగే జన్యువుల్లో లోపాల వల్ల కూడా కొందర్లో ఈ సమస్య కనిపించవచ్చు. అయితే ఒకసారి ఈ సమస్య మొదలైతే ఎక్కువసేపు నిలబడి ఉద్యోగాలు చేసే టీచర్లు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు మొదలైన వాళ్లలో సమస్య మరింత తీవ్రమవుతుంది. అంతకు ముందువరకూ ఈ సమస్య లేకపోయినా కొత్తగా మొదలైతే కూడా ఇది క్రమేపీ పెరుగుతూ పోతుంది. అలాగే ఊబకాయుల్లో కూడా ఈ సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. వెరికోజ్ వెయన్స్ రాకుండా ఉండాలంటే పిక్క భాగం కదులుతూ ఉండాలి. కానీ ఎక్కువ సమయం పాటు కూర్చునే ఉద్యోగాలు చేయడం, ఇంట్లో ఉన్నప్పుడు కూడా ఎక్కువగా విశ్రాంతిలో గడపడం వల్ల పిక్క భాగానికి తగిన వ్యాయామం దొరకట్లేదు. ఇలాంటి సెడెంటరీ లైఫ్ స్టయిల్ వల్ల కూడా వెరికోజ్ వెయిన్స్ సమస్య మొదలవ్వొచ్చు.

వెరికోజ్ వెయిన్స్ రాకుండా!

వెరికోజ్ వెయిన్స్ వచ్చే వీలుండే జన్యువులు కలిగి ఉంటే ఈ సమస్య కచ్చితంగా వస్తుంది. తల్లితండ్రుల నుంచి పిల్లలకూ ఇది సంక్రమించవచ్చు. అయితే ఈ ఇబ్బంది తలెత్తకుండా ఉండాలంటే వెరికోజ్ వెయిన్స్ వచ్చే వీలున్న వాళ్లు, కొన్ని ఆరోగ్యపరమైన అలవాట్లను అలవరుచుకుంటే కొంత మేరకు నియంత్రించవచ్చు. అలాగే వెరికోజ్ వెయిన్స్ వచ్చినా, అది మరింత తీవ్రతరం కాకుండా కూడా నియంత్రించుకోవచ్చు. వంశపారంపర్యంగా సంక్రమించే వీలు లేకపోయినా నిలబడి ఉద్యోగాలు చేసేవాళ్లు, ఎక్కువ సమయంపాటు కూర్చుని ఉద్యోగాలు చేసేవాళ్లు కాలి పిక్కలు కదిలేలా కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలి. అవేంటంటే....

నిలబడి ఉద్యోగాలు చేసేవాళ్లు ప్రతి పది నిమిషాలకోసారి పది అడుగులు అటూ ఇటూ నడవాలి. ఇలా ప్రతి పది నిమిషాలకూ చేస్తూ ఉండాలి.

టీచర్లు ఉన్న చోటనే నిలబడకుండా క్లాస్‌రూమ్‌లో అటూ ఇటూ నడుస్తూ ఉండాలి.

స్థూలకాయుల్లో వెరికోజ్ వెయిన్స్ వచ్చే అవకాశాలు 30 నుంచి 40% ఎక్కువ. కాబట్టి బరువు తగ్గించుకోవాలి.

ఎక్కువ సమయంపాటు కూర్చుని ఉద్యోగం చేసేవాళ్లు కూడా కూర్చున్న చోటే కాలి పిక్కలు కదిలే వ్యాయామాలు చేయాలి. ప్రతి అరగంటకూ లేచి కనీసం 5 నిమిషాలపాటైనా నడుస్తూ ఉండాలి. స్నానం చేస్తున్న ప్రతిసారీ కాళ్ల మీద దృష్టి పెట్టాలి. రంగు మారుతున్నాయేమో గమనించాలి.

నిర్లక్ష్యం చేస్తే?

విదేశాలతో పోలిస్తే మన దేశంలో వెరికోజ్ వెయిన్స్ మీద అవగాహన తక్కువ. కాబట్టే సమస్య తీవ్రమైన తర్వాత వైద్యులను కలుస్తూ ఉంటారు. వెరికోజ్ వెయిన్స్ వల్ల కాళ్ల నొప్పులుంటాయి. కాబట్టి ఆ నొప్పులతో కొందరు నడకను పూర్తిగా తగ్గించేస్తారు. దాంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే...

కాళ్ల మీద చర్మం నల్లగా మారి, అందవిహీనంగా తయారవుతుంది.

ఈ దశను నిర్లక్ష్యం చేస్తే కాళ్ల మీద పుండ్లు ఏర్పడతాయి.

ఉబ్బిన సిరల్లో రక్తం గడ్డలు ఏర్పడి (థ్రోంబోసిస్) గుండెకు చేరుకుని గుండె పోటుకు దారితీస్తాయి.

రక్తసరఫరా సరిగా జరగదు కాబట్టి తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లూ కలగొచ్చు.

గర్భిణుల్లో!

30 నుంచి 50 ఏళ్ల లోపు మహిళల్లో వెరికోజ్ వెయిన్స్ సమస్య మొదలవ్వొచ్చు. మరీ ముఖ్యంగా గర్భిణుల్లో ఈ ఇబ్బంది తలెత్తే అవకాశాలు ఎక్కువ. గర్భంతో ఉన్నప్పుడు పెరిగిన శరీర బరువు వల్ల కాళ్లలోని సిరల మీద ఒత్తిడి పడుతుంది. దాంతో వెరికోజ్ వెయిన్స్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. మరీ ముఖ్యంగా తల్లితండ్రుల్లో ఎవరికైనా వెరికోజ్ వెయిన్స్ ఉంటే గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలి. గర్భంతో ఉన్నా వైద్యుల సూచనల మేరకు పిక్కల కదలికలు పెంచే వ్యాయామాలు క్రమం తప్పకుండా చేయాలి. కొందరు గర్భిణుల్లో గర్భంతో ఉన్నప్పుడు కనిపించే వెరికోజ్ వెయిన్స్ ప్రసవం తర్వాత తగ్గిపోవచ్చు. ఇంకొందరికి ప్రసవం తర్వాత కూడా కొనసాగవచ్చు.

కాళ్ల మీద పుండ్లు

మధుమేహంతో సంబంధం లేని 'నాన్ డయాబెటిక్ అల్సర్లు' వెరికోజ్ వెయిన్స్ వల్లే ఏర్పడతాయి. ఈ సమస్యను పుండుగానే చూస్తారే తప్ప అది ఏర్పడడానికి కారణం గురించి ఆలోచించరు. చర్మం రంగు మారితే చర్మ వైద్యులను కలిసి, పైపూతలు, ఆయింట్‌మెంట్లు పూయడం చేస్తుంటారు. పుండు పడితే యాంటీబయాటిక్ క్రీమ్‌లు వాడుతూ ఉంటారు. ఇలా వెరికోజ్ వెయిన్స్ వల్ల ఏర్పడిన పుండ్లు నిర్లక్ష్యానికి గురై మరీ పెద్దవైతే పూర్తిగా కాలే తొలగించాల్సిన దుఃస్థితికీ దారితీయొచ్చు. కాబట్టి అకారణంగా కాళ్ల మీద పుండ్లు ఏర్పడితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.



7 'ఎండోవీనస్ లేజర్ సర్జరీ'తో సత్ఫలితం!

వెరికోజ్ వెయిన్స్ సమస్య మందులతో తగ్గదు. కాళ్ల మీద వచ్చిన నలుపును ఎటువంటి ఆయింట్‌మెంట్లు, నూనెలూ తగ్గించలేవు. ఇలా చేయకూడదు కూడా! వెరికోజ్ వెయిన్స్‌ను తగ్గించాలంటే 'కన్జర్వేటివ్ లేదా సర్జికల్' పద్ధతులనే అవలంబించాలి. కన్జర్వేటివ్ మెథడ్‌లో వెరికోజ్ వెయిన్స్ సమస్య తీవ్రం కాకుండా కొన్నాళ్లపాటు సాక్స్ వేసుకోవచ్చు. సాక్స్‌కు బదులుగా చేతికందిన గుడ్డలు కట్టేయకూడదు. మెడికేటెడ్ సాక్స్ వేసుకుంటేనే సిరల మీద ఒత్తిడి పడుతుంది. సాక్స్ పద్ధతి కూడా ప్రారంభదశలో ఉన్న వెరికోజ్ వెయిన్స్‌కే పని చేస్తుంది. సాక్స్ కొంతవరకూ సమస్యను కంట్రోల్ చేస్తుంది కానీ నయం చేయదు. ఎప్పుడు సాక్స్ వేయడం మానేస్తే అప్పుడు తిరిగి వెరికోజ్ వెయిన్స్ ఉబ్బడం మొదలు పెడతాయి. కాబట్టి శాశ్వతంగా ఈ సమస్య తొలగించుకోవాలంటే లేజర్ సర్జరీని ఆశ్రయించాలి. పాత రోజుల్లో ఉబ్బిన సిరలను కత్తిరించి తీసేసేవాళ్లు. దీని ఫలితం 60 శాతమే! ఈ సర్జరీలో మత్తు ఇచ్చి, కోసి, సిరలను తీసేస్తారు. కాబట్టి కుట్లు పడతాయి. ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉండాలి. కోలుకోవడానికి కూడా ఎక్కువ సమయం పడుతుంది. ఈ సర్జరీకి ప్రత్యామ్నాయంగా లేజర్ సర్జరీ ప్రస్తుతం అందుబాటులోకొచ్చింది. దీన్లో వెరికోజ్ వెయిన్స్‌ను నిర్ధారించుకోవడం కోసం వాడే స్కానింగ్ మిషన్‌ను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి, ఏ సిరలు పని చేయట్లేదో వాటిలోకి లేజర్ ఫైబర్‌ను పంపిస్తారు. ఆ సన్నని ఫైబర్ ద్వారా చిన్న జల్లెడను పంపించి, కవాటాలు తిరిగి మూసుపోకుండా నియంత్రిస్తారు. 15 నిమిషాలు పట్టే ఈ సర్జరీ తర్వాత గంటకే ఇంటికెళ్లిపోవచ్చు. మరుసటి రోజు నుంచే పనులన్నీ చేసుకోవచ్చు. వెరికోజ్ వెయిన్స్ అంటే బయటకి ఉబ్బిన రక్తనాళాలు కనిపించాలి అనుకుంటారు. కానీ అది అపోహ మాత్రమే! కేవలం 25% మందిలో మాత్రమే ఉబ్బిన సిరలు బయటకి కనిపిస్తాయి. మిగతా వాళ్లలో అంతర్గతంగా ఉబ్బి ఉంటాయి.

వెరికోజ్ అనే లాటిన్ పదానికి 'ఉబ్బడం' అని అర్థం. ఆకారం మార్చుకుని పెద్దగా తయారైన సిరలను 'వెరికోజ్ వెయిన్స్' అంటారు.

కాళ్లు నలుపెక్కుతాయి..

సిరలు ఉబ్బుతాయి.. కొద్దో గొప్పో నొప్పీ ఉంటుంది.. చూడడానికి ఎబ్బెట్టుగా ఉన్నా అంతగా ఇబ్బంది లేదని నిర్లక్ష్యం చేస్తాం! కానీ 'వెరికోజ్ వెయిన్స్'ను దమరిస్తే అంతే

# 'సలార్'లో ప్రభాస్‌తో కలిసి నటించే గోల్డెన్ ఛాన్స్..!

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ప్రశాంత్ నీల్ దర్శకత్వం లో 'సలార్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. హెూంబలే ఫిలింస్ బ్యానర్ పై విజయ్ కిరంగందూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. తాజాగా సలార్ టీమ్ ఈ చిత్రంలో నటించే అరుదైన అవకాశాన్ని కలిగిస్తున్నట్లు ప్రకటించింది. 'సలార్' సినిమాకు సంబంధించిన ఆడిషన్స్ ఈ నెల 15న నిర్వహించనున్నట్లు దర్శకనిర్మాతలు ప్రకటనను విడుదల చేశారు. నటనపై ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 15న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్ శేరిలింగంపల్లిలోని అల్యూమినియం ఫ్యాక్టరీకి రావాలంటూ 'సలార్' మేకర్స్ తెలిపారు. ఏదైనా భాషలో ఓ నిమిషం పాటు నటించిన వీడియోని తీసుకురావాలని.. ఏజ్ లిమిట్ లేదని ప్రకటించింది. ఇలాంటి ఆడిషన్స్ త్వరలో బెంగళూరు చెన్నై నగరాలలో కూడా నిర్వహిస్తామని వారు ప్రకటించారు. మరి డార్లింగ్ ప్రభాస్ పక్కన నటించే అరుదైన అవకాశాన్ని ఎవరు దక్కించుకుంటారో చూడాలి. కాగా 'కేజీఎఫ్' దర్శకనిర్మాతలతో ప్రభాస్ అనౌన్స్ చేసిన 'సలార్' మూవీపై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. 'ది మోస్ట్ వాలెంట్ మెన్.. కాల్డ్ వన్ మెన్.. ది మోస్ట్ వాలైంట్' అంటూ ప్రభాస్ గూర్చి తెలియజేస్తూ విడుదల చేసిన 'సలార్' టైటిల్ పోస్టర్ విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో ప్రభాస్ వైలెంట్ లుక్ ఫ్యాన్స్ ని ఫిదా చేసింది. పాన్ ఇండియా లెవల్లో రూపొందనున్న ఈ చిత్రాన్ని వచ్చే జనవరిలో స్టార్ట్ చేస్తామని.. 2021లో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.




# ఆ రియల్ హీరో ఆస్తులు తాకట్టు పెట్టాడట



కరోనా ఎప్పుడైతే మొదలైందో దేశమంతా అప్పుడే చిన్నాభిన్నం అయిన విషయం తెలిసిందే. మంది ప్రజలు కరోనా కారణంగా ఆర్థిక ఇబ్బందుల పాలయ్యారు. ఇక వలసకూలీల కష్టాలు చెప్పడానికి మాటలే లేవు. సొంతూరుకి చేరుకునేందుకు వాళ్లు వేలకు వేల కిలో మీటర్లు నడుచుకుంటూ వెళ్లిన విషయం మరచిపోలేము. చేసుకోవడానికి పనిలేక అబ్బాయిపై తినడానికి తిండి లేక వలసకూలీలు సామాన్య ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారు. ఆ సమయంలో వలస కూలీలు పేదల కష్టాలు చూసి చలించిపోయిన ప్రముఖ నటుడు సోనూసూద్ వందలాది మంది తన టీం సభ్యులు వెంటేసుకొని ఎవరి కష్టం అంటే వారి దగ్గరికి వెళ్లి వారికి ఆర్థిక సాయం అన్నదానం చేశారు. వలస కూలీలు సొంతూళ్లకు చేరుకోవడానికి ప్రత్యేక బస్సులు ట్రైన్లు ఏకంగా విమానాలను కూడా బుక్ చేశాడు. వలస కూలీలను వారి వారి ప్రాంతాలకు చేర్చేందుకు సోనూ సూద్ భారీగానే ఖర్చు పెట్టాడు. సినిమాల్లోకి వచ్చిన సోనూసూద్ తర్వాత భారీగానే సంపాదించాడని అందువల్లే ఇంత సాయం చేయగలిగాడని వార్తలు వచ్చాయి. మీడియాతో పాటు సోషల్ మీడియాలో సోనూ సూద్ ఆస్తులు రూ.వందల కోట్ల లో ఉన్నట్టు లెక్కలు వేసి మరీ వార్తలు వండి వార్చారు. అయితే సోనుసూద్ గురించి తాజాగా ఓ షాకింగ్ నిజం తెలిసింది. అతడు తన ఆస్తులను తాకట్టు పెట్టినట్లు సమాచారం. ముంబైలో రూ 10 కోట్ల విలువ చేసే ఆరు ప్లాట్లను రెండు దుకాణాలను సోనూ తాకట్టు పెట్టాడట. ఇందుకు సంబంధించిన ఒప్పందాలపై నవంబర్ 24న రిజిస్టర్ చేశాడని ఆ ఆస్తులన్నీ తన భార్య సోనాలి పేరిట ఉన్నవని చెబుతున్నారు. ఇన్ని రోజులు రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నాయి కాబట్టి సోనూ వలస కూలీల కు సాయం చేశాడని అందరూ అనుకుంటుండగా ఇప్పుడు తన ఆస్తులను తాకట్టు పెట్టి మరీ సోనూ సూద్ వలస కూలీల కు సాయం చేశాడని అర్థమవుతోంది. ఈ విషయం తెలిసిన తరువాత నెటిజన్లు సినీ అభిమానులు మరోసారి సోనూ సూద్‌ని పొగుడుతూ కామెంట్స్ చేస్తున్నారు.

# సతీమణిపై బన్నికి ఎంత ప్రేమంటే..!?



నిహారిక పెళ్లి సందడి ప్రస్తుతం సంచలనంగా మారింది. ఈ వేడుకలో మెగా హీరోలంతా కుటుంబ సమేతంగా హాజరయ్యారు. బన్ని-స్నేహారెడ్డి.. చరణ్ – ఉపాసన జంటలు ఈ వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పెళ్లి సందడికి సంబంధించిన ఫోటోలు వీడియోలు అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకెళుతున్నాయి. ఇక బన్ని అయితే తన సతీమణి డిజైనర్ ఫోటోషూట్లను షేర్ చేస్తూ ఫన్నీ కామెంట్లతో హాట్ టాపిక్ గా మారారు. ప్రతిసారీ బన్నీ టైమింగ్ ఫన్ అభిమానుల్ని ఆకర్షిస్తున్నాయి. స్నేహ ఫోటోను షేర్ చేస్తూ బన్నీ ఇదివరకూ రకరకాల వ్యాఖ్యల్ని జోడించారు. ప్రత్యేక విమానంలో వస్తున్నప్పుడు స్నేహ ఫోటోకి క్యూటీ అని వ్యాఖ్యను జోడించారు. స్నేహారెడ్డి కోపంగా అలకతో కనిపిస్తున్న ఫోటోకి శ్రీమతి ఇచ్చిన పోజు క్యూట్ అన్న వ్యాఖ్యను టైమింగ్ తో జోడించారు. తాజాగా బన్నీ మరోసారి తన శ్రీమతి ఫోటోని షేర్ చేసి ఆసక్తికర వ్యాఖ్యను జోడించారు. అమిత్ అగర్వాల్ డిజైన్ చేసిన దుస్తుల్లో స్నేహ కుందనపు బొమ్మను తలపించగా.. హర్మన్ కౌర్ స్టైలింగ్ చేసిన ఫోటో షేర్ చేశారు. ఇందులో స్నేహ ఫోటోకి బన్నీ హాట్ అంటూ వ్యాఖ్యను జోడించాడు. బన్ని-స్నేహ జంట ఫోటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో అభిమానులు వాటిని వైరల్ చేస్తున్నారు.



# నిర్మోహమాటంగా దర్శకేంద్రుడికి నో చెప్పిన సామ్

దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు త్వరలో నటుడిగా తెరంగేట్రం చేయనున్నారన్న వార్త ఆశ్చర్యపరుస్తోంది. 78 ఏళ్ల ఈ సీనియర్ దర్శకుడు మెయిన్ లీడ్ లో ఓ మూవీ త్వరలోనే తెరపైకి రాబోతోంది. ఈ చిత్రానికి ప్రముఖ నటుడు.. దర్శక రచయిత తనికెళ్ల భరణి దర్శకత్వం వహించబోతున్నారు. ప్రస్తుతం ఈ మూవీ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఓ రిటైర్డ్ అధికారి తన జీవితంలో గడిచిపోయిన మధుర జ్ఞాపకాల్ని గుర్తు చేసుకునే క్రమంలో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ మూవీ సాగనుందట. మై ఆటో గ్రాఫ్ స్వీట్ మెమోరీస్ తరహాలో సాగే ఈ చిత్రంలో రాఘవేంద్రరావుకు జోడీగా ముగ్గురు హీరోయిన్ లని అనుకున్నారు. రమ్యకృష్ణ- శ్రియ- సమంతలని ఫైనల్ చేయాలని తనికెళ్ల భరణి ప్లాన్ చేశారు. ఇప్పటికే రమ్యకృష్ణతో చర్చలు జరిపి ఓకే చేసుకున్నారు. సమంతని కూడా ఇటీవల సంప్రదించారట. అయితే సమంత మాత్రం 78 ఏళ్ల రాఘవేంద్రారవు పక్కన నటించడానికి ఆసక్తిని చూపించలేదట. తనికెళ్ల భరణి ఇచ్చిన ఆఫర్ ని సున్నితంగా తిరస్కరించినట్టు తెలిసింది. సమంత ప్లేస్ లో తమన్నాని సంప్రదిస్తున్నారట. సమంత ప్రస్తుతం ఏ సినిమాని అంగీకరించే మూడ్ లో లేదట. ఆ కారణంగానే రాఘవేంద్రావు చిత్రాన్ని తిరస్కరించిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. సామ్ నటించిన ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 2 కోసం అభిమానులు కళ్లు కాయలు కాసేలా వేచి చూస్తున్నా దానికి సంబంధించిన సరైన సమాచారం లేదు.

# 'శ్యామ్ సింగ రాయ్' మూవీని ప్రారంభిస్తున్న నాని..!

వైవిధ్యమైన కథలను విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ కెరీర్ లో ముందుకు సాగుతున్న నేచురల్ స్టార్ నాని.. "శ్యామ్ సింగ రాయ్" అనే చిత్రంలో నటించనున్న సంగతి తెలిసిందే. 'టాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహించనున్నారు. ఇది కలకత్తా బ్యాక్ డ్రాప్ లో రూపొందే హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ అని తెలుస్తోంది. ఇందులో నాని డిఫరెంట్ షేడ్స్ ఉన్న ఛాలెంజింగ్ రోల్ లో నటించి ఫ్యాన్స్ ని సర్ప్రైజ్ చేయబోతున్నాడు. నాని కెరీర్లో అత్యధిక బడ్జెట్ తో రూపొందనున్న ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్టైన్మెంట్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. 'శ్యామ్ సింగ రాయ్' చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో రేపు హైదరాబాద్ లో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కాగా ఇప్పటికే చిత్ర యూనిట్ విడుదల చేసిన 'శ్యామ్ సింగ రాయ్' కాన్సెప్ట్ పోస్టర్ విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రానికి మిక్కీ జె.మేయర్ సంగీతం సమకూర్చానున్నాడు. ఇక నాని సరసన నేచురల్ బ్యూటీ సాయి పల్లవి.. యంగ్ బ్యూటీ కృతి శెట్టి నటించనున్నారు. వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కనున్న ఈ సినిమాపై నాని అభిమానుల తోపాటు సినీ వర్గాల్లో కూడా మంచి అంచనాలున్నాయి. ప్రస్తుతం 'టక్ జగదీష్' సినిమా షూటింగ్ ని పూర్తి చేసే పనిలో ఉన్న నాని.. త్వరలోనే ల్ 'శ్యామ్ సింగ రాయ్' మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నాడు.




# హాట్ యాంకర్ సిల్క్ స్మితగా డర్టీపిక్చర్‌కి సిద్ధమా?



రంగస్థలం రంగమ్మత్తగా కుర్రకారు హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది హాట్ యాంకర్ అనసూయ. జబర్దస్త్ యాంకర్ గా తనకు దక్కిన పాపులారిటీని అనసూయ ఎక్కడా మిస్ యూజ్ చేయలేదు. సోగ్గాడే చిన్ని నాయనా మొదలు వరసగా పలు క్రేజీ చిత్రాలకు సంతకం చేసిన అనసూయ వెండితెర అభినయంలో వెనుతిరిగి చూసిందే లేదు. వైయస్సార్ బయోపిక్ యాత్రలోనూ కీలక పాత్రను పోషించిన అనసూయ కథనం చిత్రంలో ప్రధాన పాత్రధారిగా నటించి ఆకట్టుకున్నారు. ప్రస్తుతం పలు క్రేజీ చిత్రాల్లో అనసూయ నటిస్తోంది. ఈసారి కాస్తంత హాట్ కంటెంట్ తో యువ హృదయాల్లో బౌన్సర్ వేసేందుకు అనసూయ రెడీ అవుతుండడంతో ఇటు తెలుగు ప్రేక్షకులు అటు తమిళ ప్రేక్షకుల్లోనూ ఆసక్తి నెలకొంది. ఇంతకీ ఏ సినిమా అది? ఎలాంటి పాత్రలో? అంటే వివరాల్లోకి వెళ్లాలి. ఏలూరుకు చెందిన విజయలక్ష్మి అలియాస్ సిల్క్ స్మితగా బోల్డ్ పాత్రలో సర్ ప్రైజ్ ఏయబోతోంది అనసూయ. తాజాగా అందుకు సంబంధించిన గెటప్ ని సోషల్ మీడియాల్లో తనే స్వయంగా రివీల్ చేయడంతో బోయ్స్‌లో అది కాస్తా వైరల్ గా మారింది. అనసూయను నెవ్వర్ బిఫోర్ హాట్ అవతార్‌లో చూడబోతున్నామన్న ఉత్సాహం అభిమానుల్లో నెలకొంది. ఇక ఇటీవలే తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి సినిమాకి కమిటైన అనసూయ ఆ చిత్రంలో ఎలాంటి పాత్రలో నటిస్తున్నారో వెల్లడించకపోవడంతో దీనిపై బోలెడంత సస్పెన్స్ నెలకొంది. తాజా ఫోటోల్ని బట్టి ఇది సౌత్ ఐటెమ్ గాళ్ సిల్క్ స్మిత పాత్ర అని గెస్ చేస్తున్నారు. అయితే దీనిపై అనసూయ అధికారికంగా ఏదీ చెప్పలేదు. రంగమ్మత్త కెరీర్ లో మరో ఛాలెంజింగ్ రోల్ చేస్తోందని మాత్రం అభిమానులకు అర్థమవుతోంది. తమిళ సినిమా ఆన్ లొకేషన్ రిలాక్స్ డ్ గా కుర్చీలో కూచుని ఫోన్ లో తథేకంగా చూస్తున్న అనసూయ ఫోటో ఒకటి వైరల్ గా మారింది. ఒకవేళ సిల్క్ పాత్రనే అయితే ది డర్టీ పిక్చర్ లో విద్యాబాలన్ ని మించి చెలరేగుతుందనడంలో ఎలాంటి సందేహమేం లేదు. దాదాపు 200పైగా తెలుగు- తమిళ- మళయాళ- కన్నడ చిత్రాలలో నటించిన సిల్క్ స్మిత.. అనేక సినిమా లలో ప్రత్యేక గీతాల్లో నర్తించింది. శృంగార రస నృత్యాలతో రంజింపజేయడం లో సిల్కుని కొట్టేవాళ్లే లేరన్న గుర్తింపు దక్కింది. హాటెస్ట్ బోల్డెస్ట్ స్టార్ గా అవతరించిన సిల్క్ స్మిత కథతో బాలీవుడ్ నిర్మాతలు కాసులు కొల్లగొట్టారు. అయితే సౌత్ లో మాత్రం సిల్క్ జీవితకథను సినిమాగా తీసే ప్రయత్నం చేయకపోవడం చర్చనీయాంశమైంది. సేతుపతి ఈసారి అలాంటి ప్రయత్నం చేస్తున్నారా? అన్న చర్చా సాగుతోంది. ఈ సినిమాతో పాటు రవితేజ 'ఖిలాడి'.. కృష్ణవంశీ 'రంగమార్తాండ' చిత్రాల్లోనూ అనసూయ నటిస్తోంది. అనసూయ ప్రధాన పాత్రలో 'థ్యాంక్యూ బ్రదర్' త్వరలో విడుదల కానుంది.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989